వజ్రాల భరిణె

వసుంధర

ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్రావు తీవ్రాలోచనలో వున్నాడు.

ఊళ్లో స్మగ్లింగ్ అపరేషన్సు బాగా యెక్కువై పోయాయి. లక్షల విలువ చేసే వజ్రాలు ప్రతిరోజూ చేతులు మారిపోతున్నాయి. అపరేషన్సు కొత్తపద్ధతిలో జరుగుతున్నవేమో—ఏమీ క్లూ దొరకడంలేదు.

ఈశ్వర్రావు సమర్ధుడిగా డిపార్టుమెంట్లో మంచి పేరు తెచ్చుకున్నాడు. కానీ ఇటీవల ఆ పేరు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఎన్నడూ లేనిది మొదటిసారిగా పై ఆఫీసరు చేత చీవాట్లుకూడా తిన్నాడతడు.

అతడు నగరంలో అనుమానాస్పద ప్రాంతాలన్నింటినీ పరిశీలించాడు. మెరికల్లాంటి కాన్‌స్టేబుల్ని ఊరంతా నిఘా వేయించాడు. నేరస్థుల జాబితాలో వున్న వ్యక్తు లందరిమీదా ఓ కన్ను వేసి వుంచాడు. పెద్దమనుషులుగా చలామణీ అవుతున్న వారి గురించికూడా తగు జాగ్రత్తలో వున్నాడు.

స్మగ్లింగ్ ఆపరేషన్స్ ఎటువంటి అవకాశాలుం టాయో—తనకు తెలిసిన మేరకు ఊహించి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. అయినప్పటికీ వజ్రాల స్మగ్లింగ్ కొనసాగిపోతూనే వున్నవి.

అసలు స్మగ్లింగ్ అన్నది కొనసాగడంలేదనీ—తను తీసుకున్న చర్యల అనంతరం—స్మగ్లింగ్ సాధ్యపడదనీ ఈశ్వర్రావు పై అధికారులకు చెప్పిచూశాడు. అయితే వారు అంగీకరించలేదు.

దిక్కూ మొక్కూ తెలియని ఓ శవం దగ్గర వారికో చిన్న ట్రాన్సిస్టర్‌వంటి సాధనం దొరికింది. అది ఒక రిసీవర్ సెట్.

ఒక బాస్‌నుంచి ఆ సెట్ సందేశాలను అందుకుం టున్నది.

పోలీసులకు ఆ సెట్‌నుబట్టి ఈ క్రింది విషయాలు తెలిశాయి.

ఒక అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా దేశంలోని వివిధ ప్రాంతాల్లో జోరుగా వ్యవహరిస్తున్నది. ఈ ఊరిలో మొత్తం పాతికమందివద్ద ఇటువంటి సెట్స్ వున్నవి. ఆ సెట్స్ సందేశాలను అందుకునేందుకే తప్ప పంపడానికి పనికిరావు. ఆ సందేశాలు కూడా ఎక్కువ సమాచారా న్నందజేసేవిగా లేవు. ఆ సందేశాలు పాతికమందికీ ఒకేసారి ఉద్దేశించబడినవి.

"మీ కారణంగా నిన్న నలభై లక్షల విలువైన వజ్రాల మార్పిడి జరిగింది. గుడ్ వర్క్.... థాంక్స్...."

"ఈ రోజు రికార్డు. ఒక కోటీ అయిదు లక్షలు. కీపిటప్—థాంక్స్...."

"ఈ రోజు పది లక్షలు మాత్రమే....డోన్ట్ వర్రీ....

మీ ఇబ్బందులు నాకు తెలుసు. రేపు ఇది మేకప్ చేసే యాలి.... బెస్టాఫ్ లక్...."

సందేశాలు ఆ సమానూ రావడంలేదు. ఒకోసారి రోజు విడిచి రోజు. ఒకోసారి పదేసి రోజుల వ్యవధి అనంతరం....ఒకసారి మూడు వారాల గ్యాప్ కూడా వచ్చింది.

పోలీసులు ఆ రిసీవర్ సెట్‌ను నిత్యం ఆన్ చేసి వుంచుతున్నారు. సందేశం ఎక్కడినుంచి వస్తున్నదో, ఎవరికి చేరుతున్నదో వారికి తెలుసుకోవడం సాధ్యపడ లేదు. కానీ స్మగ్లింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని మాత్రం తెలిసింది.

ఈశ్వర్రావుకిది ప్రాణాంతకంగా వున్నది. ఈ రిసీవర్ సెట్‌లో ఎవరైనా తమను ఫూల్ చేయడం లేదుగదా అని అతడికి అనుమానం వచ్చింది. ఈ అనుమానాన్ని అతడు పై అధికారులముందు వ్యక్తం చేయలేడు. వారు తనతో ఏకీభవించరని అతడికి బాగా తెలుసు.

అందుకే యేం చేయాలో తెలియక ప్రతిరోజూ ఈ విషయమై తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఆ రోజు అతడు మరింత తీవ్రాలోచనలో వున్నాడు. ఆలోచనలో టైము రాత్రి పది దాటిందని కూడా అతడు గుర్తించలేదు.

అప్పుడు—"సార్!" అన్న పిలుపు వినిపించి తలెత్తి చూశాడతను.

ఈశ్వర్రావు ప్రశ్నార్థకంగా అతడివంక తలెత్తి చూశాడు.

"మన స్టేషన్‌కు పక్కగా వున్న బస్ స్టాపులో ఓ మనిషిని చూశాను సార్! ఓ బిచ్చగాడికి అతడు తింటున్న

వేరుశనక్కాయల పొట్లం దానంచేశాడు. ఆ దానం ఎలా గున్నదంటే — అతడు ఆ బిచ్చగాడికోసం యెదురు చూస్తున్నట్లూ—అతడికివ్వడంకోసమే తనచేతిలో వేరుశనగకాయల పొట్లం ఉంచుకున్నట్లూ — నాకు అనిపించింది—"

ఈశ్వర్రావు చిరాగ్గా—"కొంతమంది అంతే—ఏమైనా తింటూండగా బిచ్చగాళ్ళు అడిగితే వెంటనే అది ఇచ్చేస్తారు. ఇందులో విశేషమేమీ లేదు...." అన్నాడు.

"కానీ సార్ ....అతడి జేబులో ఓ వస్తువు చూశాను. వేరుశనగకాయల పొట్లం తీసేటప్పుడు—అదీ బయటకు వచ్చింది. పొట్లం చేతిలో వుంచుకుని దాన్నతడు మళ్ళీ జేబులోకి తోసేశాడు. పొట్లంలోంచి ఓ రెండు వేరుశనగలు తిన్నాడో లేదో—బిచ్చగాడు వచ్చాడు...."

"ఏమిటా వస్తువు?"

"అది మనదగ్గరున్న రిసీవర్ సెట్ లాగున్నది సార్.." అన్నాడు కాన్‌స్టేబుల్.

ఈశ్వర్రావు ఉలిక్కిపడి లేచి నిలబడి — "వాడెక్కడ?" అన్నాడు.

"ఓ కాన్‌స్టేబుల్ అతణ్ని వాచ్ చేస్తున్నాడు సార్" అన్నాడు కాన్‌స్టేబులు. ఈశ్వర్రావు వెంటనే స్టేషన్ లోంచి బయటకు వచ్చి ఆ యువకుణ్ణి చూశాడు.

అతడికి గుబురు గెడ్డం వున్నది. బహుశా అది పెట్టుడు గెడ్డమై ఉండాలి. కాన్‌స్టేబులు, ఈశ్వర్రావుకి అతణ్ని చూపించాడు.

ఈశ్వర్రావు అతడివైపు నడిచాడు.

బస్‌స్టాపులో వున్నతను ఈ పోలీసుల వ్యవహారం చూశాడు. అయినా కదలలేదు. ఓరకంట పోలీసులను

గమనిస్తున్నాడు.

ఈశ్వర్రావు అతడిని సమీపించాడు. అతడు ఈశ్వర్రావు వంక చూడలేదు.

"మిస్టర్! నిన్ను సోదా చేయాలి—" అన్నాడు ఈశ్వర్రావు.

"ఎందుకు?"

"సోదా చేశాక చెబుతాను...." అన్నాడు ఈశ్వర్రావు.

అతడు చేతులెత్తి నిలబడ్డాడు.

ఈశ్వర్రావు అతడిని సోదా చేయడానికి ముందుకు వచ్చాడు.

అతడూ ఒకడుగు ముందుకువేసి చటుక్కున ఈశ్వర్రావుని ఒక్క తోపు తోసి అక్కణ్ణించి ఒక్క పరుగు తీశాడు.

ఇది ఊహించలేదు ఈశ్వర్రావు.

ఈశ్వర్రావు వెనకనే వున్న కానిస్టేబుల్ వెంటనే విజిల్ వేశాడు.

ఈశ్వర్రావు .... ఇద్దరు కానిస్టేబుల్సు .... అతడిని వెంట తరిమారు.

అతడు రెండు సందులు తిరిగి ఆపద్ధర్మంగా చటుక్కున ఓ యింట్లో దూరాడు. ఆ యింటి తలుపులు ఓరవాకిలిగా తెరిచి వున్నాయి.

ఈశ్వర్రావు ఆ యింట్లోకి అడుగుపెట్టేసరికి అతడు దొడ్డిదారిన ఎటో పారిపోయాడు.

గదిలో కూర్చున్నాయన—కంగారుగా—"అతడెవరు సార్—అలా హఠాత్తుగా యింట్లో చొరబడ్డాడు—"

అన్నాడు.

ఈశ్వర్రావు క్లుప్తంగా వివరంగా చెప్పి — "దొంగ దొరికినట్లే దొరికి తప్పించుకున్నాడు—అంతా నా దుర దృష్టం—" అన్నాడు.

"హాతాత్తుగా ఇంట్లో చొరబడేసరికి నా బుర్ర పని చేయలేదు. అపైన ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు— సమయానికి నేనూ మీకు సాయపడలేకపోయాను—" అన్నాడాయన.

ఇన్స్పెక్టర్ ఈశ్వర్రావు ఆయన వివరాలు తెలుసు కున్నాడు. ఆయన పేరు సుబ్బారావు. బ్యాంకు ఏజంటుగా పనిచేస్తున్నాడు.

ఈశ్వర్రావు వెళ్ళిపోయాక సుబ్బారావు గదిలో మూలకు చూశాడు. ఇందాకా దొంగనుంచి జారిపడి మూలగా దొర్లి వెళ్ళిన కాగితం పొట్లం ఇంకా అక్కడే వున్నది. ఆ వచ్చిన ఇన్స్పెక్టర్ మనిషికోసమే వచ్చిన మూలాన ఇంటిని శోధించలేదు.

సుబ్బారావు వీధి తలుపులు వేసి ఆ పొట్లం తీశాడు. అందులో వేరుశనగకాయలున్నవి.

సుబ్బారావు ఒక్కడూ అక్కడ కూర్చుని ఏదో ఇంగ్లీషు నవల చదువుకుంటున్నాడు. ఆ పొట్లంలోని వేరుశనగకాయల నాయన తన ఎదురుగా వున్న బల్లమీద గుట్టగా పోశాడు. అప్పుడు చూశాడాయన. ఆ పొట్లం అడుగున ఒక చిన్న ప్లాస్టిక్ భరిణ వున్నది.

సుబ్బారావు ఆ భరిణ మూత తీశాడు. వెంటనే కళ్ళు జిగేల్మన్నాయి.

అందులో ధగధగలాడే వజ్రాలున్నవి.

2

"నమస్కారమండీ — నా పేరు నాగరాజారావు. చాలామంది నన్ను సింపుల్ గా మిస్టర్ నాగూ అని పిలుస్తూంటారు—" అన్నాడు తను.

ఏజంటు సుబ్బారావు అతనివంక ప్రశ్నార్థకంగా చూసి—"ఏం కావాలో చెప్పండి—" అన్నాడు.

నాగు రిస్టువాచీవంక చూసుకుని—"ఇప్పుడు పావు తక్కువ రెండయింది కదా—పబ్లిక్ ట్రాన్సాక్షన్సన్నీ మరో పావుగంటలో ముగుస్తాయనుకుంటాను-" అన్నాడు.

"అవును—అన్ని బ్యాంకుల్లాగే మా బ్యాంకు కూడా పబ్లిక్ ట్రాన్సాక్షన్సన్నీ రెండు గంటలకు క్లోజ్ చేస్తుంది—" అన్నాడు సుబ్బారావు.

"దట్స్ వెరీగుడ్!" అన్నాడు నాగు.

"ఎస్ మిస్టర్ నాగూ — మీకేదైనా సాయం కావాలన్నా—అంతే టయిముంది—" అన్నాడు సుబ్బారావు విసుగ్గా.

"అలాగంటే ఎలాగండీ—నాకు మీతో పని వున్నది రెండుగంటలయిన తర్వాతనే—" అన్నాడు మిస్టర్ నాగు తాపీగా.

"మీ మాటలు నాకర్థం కావడంలేదు—"

"మీకు వాసుదేవరావు తెలుసా?" నాగు నెమ్మదిగా అడిగాడు.

"ఎవడా వాసుదేవరావు?"

"అన్ని విధాలా మీ కల్లుడిగా వుండడానికి తగిన వాడని మీరనుకున్న వాడు. అతడు కోరిన కట్నం మీరివ్వ లేక వదులుకున్నారు. ఆ వాసుదేవరావు...."

సుబ్బారావు ముఖంలో చిరాకు మాయమయింది—

"వాసుదేవరావు మీకెలా తెలుసు?" అన్నాడు.

"మీ కారణంగానే అతడు నాకు తెలుసు. అతన్ని పెళ్ళికొప్పించగల శక్తి నాకుంది. మీ కభ్యంతరం లేని పక్షంలో నేనే పెళ్ళి స్థిరపరుస్తాను...." అన్నాడు నాగు.

"నిజంగా—" అన్నాడాశ్చర్యంగా సుబ్బారావు. ఆయన మనసులో మళ్ళీ కొత్త ఆశలు చిగిర్చాయి. వాసుదేవరావు సుబ్బారావుగారికి కన్నివిధాలా నచ్చాడు. తనకూతురికిచ్చి చేయాలని చాలా మనసుపడినా—అడిగిన కట్నం ఇవ్వలేక—సంబంధం వదులుకున్నాడు.

"నిజంగానే—కానీ మీరు నాకో చిన్న సాయం చేయాలి—"

"ఏమిటది?" అన్నాడు సుబ్బారావు అనుమానంగా.

"నేను కొత్తగా చిన్న పరిశ్రమ ప్రారంభించబోతున్నాను. అందుకుగానూ అయిదు లక్షలు అప్పుకావాలి. ఆ లోన్ శాంక్షన్ కావడానికి మీ సహకారం కావాలి—"

"ఏ లోన్ కయినా సహకార ముంటుంది. ఎటొచ్చీ మీ వైపునుంచి కాగితాలు సరిగ్గా వుండాలి. అన్నీ సక్రమంగా వుంటే నావైపునుంచి ఇబ్బందేమీ వుండదు" అన్నాడు సుబ్బారావు.

"అన్నీ సక్రమంగా వుంటే—మీ అమ్మాయి పెళ్ళి బాధ్యత నేను తీసుకోవడ మెందుకండీ?" అన్నాడు నాగు వేళాకోళంగా.

సుబ్బారావు కూడా వేళాకోళంగా నవ్వి—"సక్రమం కాని పనులు చేసేపక్షంలో — మా అమ్మాయి పెళ్ళికి మీలాంటివాళ్ళు సాయపడ్డ మెందుకూ — నాకు నేనే చూసుకోగలను—" అని—"ఇదే మీరు వచ్చిన పనయితే

ఇంక మీరు వెళ్ళవచ్చు—" అన్నాడు.

నాగు నవ్వి—"వచ్చిన పని పూర్తి చేసుకోకుండా వెళ్ళడం ఈ నాగుకు అలవాటు లేదు—" అన్నాడు.

"ఎదుటి మనుషుల్నిబట్టి అప్పుడప్పుడు కొత్త అలవాట్లు చేసుకోవాలి. చాలా శ్రమపడి వచ్చారు. వెళ్ళిరండి—" అన్నాడు సుబ్బారావు.

"వెళ్ళిరండి అన్నారు. అదే శుభసూచకం—మిమ్మల్ని నేను మళ్ళీ కలుస్తాను—" అంటూ లేచాడు నాగు.

3

"నా పేరు మహాలక్ష్మి—సులోచనగారు మీరేనను కుంటాను—" అన్నదామె.

"అవును—నేనెలా తెలుసు మీకు?" సులోచన ఆశ్చర్యంగా అడిగింది.

"ఆడపిల్ల తల్లిని—తెలుసుకోక తప్పుతుందా?" అంది మహాలక్ష్మి. సులోచన తనకేమీ అర్థంకానట్లు ముఖం పెట్టింది. మహాలక్ష్మి అది గ్రహించినట్లుగా-" సురేంద్ర మీ అబ్బాయే కదూ?" అన్నది.

"అవును-వాడెలా తెలుసు నీకు?" అన్నది సులోచన మళ్ళీ ఆశ్చర్యపడుతూ.

"ఆడపిల్ల తల్లిని—తెలుసుకోక తప్పుతుందా?" అంది మహాలక్ష్మి.

"చెప్పేదేదో సూటిగా చెప్పండి. మీ మాటలు నాకర్థం కావడంలేదు—"

"చెప్పడానికేముందమ్మా—మీ అబ్బాయి మా అమ్మాయి వెంటపడ్డాడు. కుర్రాడు ఎర్రగా బుర్రగా వున్న మూలాన అమ్మాయి అతని మోజులో పడింది. వీళ్ళిద్దరూ నాలుగు రోజుల క్రితం పార్కులో నా కళ్ళ

పడ్డారు. నిలదీసి అడిగేసరికి ప్రేమ అన్నారు. బాగానే వుంది — పెద్దవాళ్ళకు తెలియకుండా ఇలా తిరగడం బాగోలేదని మందలించాను. ఈ నాలుగు రోజులూ అమ్మాయతన్ని తప్పించుకు తిరిగింది. ఈ రోజు అతను తిన్నగా మా యింటికి వచ్చేశాడు—" అని ఆగింది మహాలక్ష్మి.

"మీరు చెప్పేది మా అబ్బాయి గురించేనా?" అనుమానంగా అడిగింది సులోచన.

"అతడి పేరు సురేంద్ర. విజయా బ్యాంకులో పని చేస్తున్నాడు. అడిగితే మీ అడ్రసిచ్చాడు—" అంది మహాలక్ష్మి.

"ఇప్పుడు వాడక్కడ ఏం చేస్తున్నాడు?" అంది సులోచన కోపంగా.

"ప్రేమించడానికి భయంలేదు కానీ ఆ విషయం తలిదండ్రులకు చెప్పడానికి భయమట. ప్రస్తుతం మా యింట్లో మా అమ్మాయితో కబుర్లు చెబుతున్నాడు. కాపలాగా మా పిల్లలున్నారు. ఈ గొప్ప దృశ్యం మీకు చూపించడానికి నేను మీ ఇంటికి పరుగున వచ్చాను—"

సులోచన ఆవేశంగా — "పదండి — మీ యింటికి వెళ్దాం—" అంది. మహాలక్ష్మి దగ్గరలో వున్న రిక్షాను పిలుస్తూంటే—సులోచన ఇంటికి తాళం వేసింది.

4

"ఎక్స్‌క్యూజ్ మీ—" అంది ఓ తీయని కంఠం. ఉద్రేకంగా ఇంగ్లీషు పాఠం చెబుతున్న మిత్ర లెక్చరర్ చటుక్కున గుమ్మంవైపు చూసి ఒక్క నిమిషం తడబడి- "ఎస్—ప్లీజ్!" అన్నాడు.

"మీ క్లాసులో వున్న దేవీబాల అనే అమ్మాయితో మాట్లాడాలి. చాల అర్జంటు—" అంది గుమ్మం దగ్గర

నిలబడ్డ తీయని కంఠం కలిగిన అప్సరసలాంటి అమ్మాయి.

లెక్చరర్ అనుమతి సూచనగా దేవీబాల వంక చూశాడు. దేవీబాల క్లాసులోంచి లేచి బయటకు వచ్చింది. ఇద్దరూ కలిసి వెళ్ళిపోతూంటే లెక్చరర్ ఓ సారి నిట్టూర్చి మళ్ళీ పాఠంలో పడిపోయాడు.

"మీ రెవరో తెలుసుకోవచ్చా?" అంది దేవీబాల ఆశ్చర్యంగా.

"నన్ను మీ రెరుగరులెండి. కానీ మా అన్నయ్య మీకు తెలుసుననుకుంటాను—" అందా అప్సరస.

"మీ అన్నయ్యెవరో చెబితే...." అంది దేవీబాల ఆలోచిస్తూ.

"వాసుదేవరావు—" అంది అప్సరస.

"వాసుదేవరావంటే...." ఇంకా ఏదో అనబోయే లోగానే దేవీబాలకతడెవరో గుర్తొచ్చేసింది. అతడు తనకు కావలసిన వరుడు. కట్నం దగ్గర బేరం కుదరక సంబంధం చెడిపోయింది.

"మీకు తెలిసిన అతనే — అప్పట్లో కట్నం దగ్గర బేరం కుదరలేదు. కానీ ఇప్పుడు కథ కొత్త దారి తొక్కింది. అందువల్ల ఈ పెళ్ళి వ్యవహారంలోంచి కట్నం సమస్య తప్పుకుంది—" అంది అప్సరస.

"నాకేమీ అర్థంకావడంలేదు. మీరు నన్నెందుకు పిలిచారో — మీ రిప్పుడేం చెప్పదల్చుకున్నారో కాస్త వివరంగా చెప్పండి—" అంది దేవీబాల.

"చెబుతాను కానీ నేనడిగిందానికి జవాబు చెప్పండి. చూడ్డానికి నే నెలాగున్నాను?"

"అప్సరసలాగున్నారు-" అంది దేవీబాల చటుక్కున.

"నా పేరూ అదేననుకోండి. ఎటొచ్చీ ఒక అక్షరం

తక్కువ. అప్సర నా పేరు—" అంటూ నవ్వింది మెల్లగా.
"ఆ కారణంగానే ఒకబ్బాయి నా వెంటపడ్డాడు—"
"ఎవరతను?" అంది దేవీబాల.
"అతడి పేరు సురేంద్ర. అతడు అచ్చం మీకులాగే వుంటాడు. అందుకే అతన్ని నేనూ ప్రేమించాను—" అని ఆగింది అప్సర.
"మిస్ అప్సరా-ఇదంతా నాకెందుకు చెబుతున్నట్లు?"
"ఈపాటికి అర్థమయే వుంటుందనుకుంటాను. సురేంద్ర నేను ప్రేమించుకోవడంతో—కథ కొత్త మలుపు తిరిగింది. నా పెళ్ళికి కట్నమివ్వాలిగదా—బదులుగా కట్న మక్కర్లేకుండా అన్నయ్య మిమ్మల్ని చేసుకోదల్చుకున్నాడు—" అంది అప్సర.
"బాగుంది. అవుననడానికీ కాదనడానికీ అంతా ఒక రిష్టమేనేమిటీ?" అంది దేవీబాల అదోలా.
"అంతేననుకుంటాను. ప్రస్తుతం మా యింట్లో నా అన్నయ్య, మీ అన్నయ్యలతోపాటు మీ అమ్మగారు కూడా వున్నారు-ఎవరెవరికి ఏయే ఇష్టాలున్నదీ అక్కడే చెప్పుకోవచ్చు—" అన్నది అప్సర.

5

"తలుపు తాళంతీసుకుని లోపలకు వెళుతున్నారు. మీవాళ్లెవరూ ఊళ్ళో లేరా?" అన్న పలకరింపుకు సుబ్బారావు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి అప్రయత్నంగా" "మీరా?" అన్నాడు.
"అవును. మిమ్మల్ని మళ్ళీ కలుస్తానని చెప్పానుగా— అందుకే మళ్ళీ వచ్చాను—" అన్నాడు నాగు.
"నేనేదో మర్యాదకు వెళ్ళిరండన్నాను. నిజంగానే మళ్ళీ వచ్చారు మీరు—అనవసరపు శ్రమ—" అన్నాడు

సుబ్బారావు.

"అనవసరంగా నేను శ్రమపడనులెండి—" అన్నాడు నాగు.

"లోపలకు రండి—మీరెంత తెలివైనవారైనా జామ చెట్టుకు ఆపిల్ కాయలు కాయించలేరు—" అంటూ లోపలకు దారితీశాడు సుబ్బారావు. నాగు ఆయన్ననుసరిస్తూ — "మీకు సత్యబాబుగారు తెలుసుననుకుంటాను. ఆయన ఏ చెట్టునుంచైనా ఏ కాయైనా కోయగలరు—" అన్నాడు.

"అది దైవశక్తి—" అన్నాడు సుబ్బారావు.

"ఏదో ఒక శక్తి—మనమనుకున్నది చేయించగలుగుతున్నదంటారా—లేదంటారా?"

"కూర్చోండి—" అన్నాడు సుబ్బారావు తనూ ఓ కుర్చీలో కూర్చుంటూ.

నాగు కూర్చుంటూ — "నేనంటే మీకిష్టంలేదు. అయినా లోపలకు రమ్మన్నారు. కూర్చోమన్నారు. చూశారా—మీకిష్టంలేని పనులు మీ చేతే ఎలా చేయిస్తున్నానో!" అన్నాడు.

"మీరు పొరబడ్డారు..మీ ఆలోచనలు తప్పుదారిలో నడుస్తున్నాయి. వాటిని సక్రమమైన మార్గంలోనికి మళ్ళించడంకోసం నేనిప్పుడో ఉపన్యాసమిచ్చే ఉద్దేశ్యంలో వున్నాను. అందుకే మిమ్మల్ని రమ్మన్నాను. కూర్చోమన్నాను. నా ఉపన్యాస ప్రభావం మీకు తెలియదు. అది తలచుకుంటే నా భార్యా బిడ్డలు వణికిపోతారు. ఇంతవరకూ నా ఉపన్యాసం పూర్తిగా విన్నవాళ్ళెవ్వరూ లేరు. సగమైనా పూర్తికాకుండానే నా కాళ్ళు పట్టుకుని—ఉపన్యాసం ఆపమనీ, బుద్ధి వచ్చిందనీ

అనేయాల్సిందే—మొహమాటం లేనివాళ్ళెవరైనా ఉప న్యాసాన్ని సుత్తి అని కూడా అంటారు—"

నాగు నవ్వి—"నేను కూడా మీ సుత్తి పూర్తిగా వినబోవడంలేదు—" అన్నాడు.

"మూళారా-మీలో అప్పుడే భయం మొదలయింది" అన్నాడు సుబ్బారావు.

"భయం కాదండీ—కాస్త ఇది చూడండి-" అంటూ నాగు జేబులోంచి ఒక పొట్లంతీసి సుబ్బారావు కందించి "ఇది కాస్త జాగ్రత్తగా విప్పిచూడండి. ఇందులో చాలా విలువైన వస్తువులున్నాయి. అలాగని తేలిక చేయ కండి. అడిగినమీదట వివరాలు చెప్పగలను. ఆ వివరాలు విన్నాక మరి మీరు సుత్తి కొట్టగలరని నేననుకోను—" అన్నాడు.

సుబ్బారావు తిరస్కారంగానే పొట్లాన్నందుకున్న ప్పటికీ దాన్ని జాగ్రత్తగానే విప్పాడు. ఆ కాగితం పొట్లంలో ఒక చిన్న గోరు, తల వెంట్రుక వున్నాయి.

"ఏమిటిది?" అన్నాడు సుబ్బారావు అసహనంగా.

"మీ అమ్మాయి దేవీబాల మా యింట్లో వున్నదన డానికి సాక్ష్యం—"

సుబ్బారావు ఉలిక్కిపడి — "మా అమ్మాయి మీకెలా తెలుసా?" అన్నాడు.

జేబులోంచి మరో రెండు పొట్లాలు తీశాడు నాగు. వాటిని కూడా సుబ్బారావు కందిస్తూ — "శ్రీమతి సులోచన, మిస్టర్ సురేంద్రలకు సంబంధించినవీ పొట్లాలు. మీరు తప్ప మిగతా మీ కుటుంబ సభ్యులందరూ మా ఇంట్లో వున్నారని తెలుపడానికి గర్విస్తున్నాను...." అన్నాడు.

సుబ్బారావు పొట్లాలు విప్పాడు. వాటిలోనూ అవే గోరు, వెంట్రుక.

"ఏమిటి మీ ఉద్దేశ్యం?" అన్నాడాయన కోపంగా.

"గోళ్ళు మనం చేతులు శుభ్రంగా ఉండడంకోసం వారానికోసారి తీసుకుంటూనే వుంటాం. వద్దనుకున్నా తల దువ్వుకునే సమయంలో కొన్ని తల వెంట్రుకలు రాలిపోతూంటాయి. శరీరంనుంచి బాధ కలిగించకుండా వేరుచేయగల భాగాలివి. ప్రస్తుతం నేను వాటి జోలికి మాత్రమే వెళ్ళాను. అంటే మీ వాళ్ళింకా ప్రమాదంలో లేరని అర్థం. అయితే వాళ్ళు ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. అది మీ చేతుల్లో వుంది. ఆలోచించుకోండి—నాకు సుత్తికొడతారో — జామ చెట్టుకు ఆపిల్సు కాయిస్తారో!" అన్నాడు నాగు గంభీరంగా.

సుబ్బారావు నాగువంక పరీక్షగా చూశాడు. అతడి కళ్ళలో భయమన్నది ఎక్కడా కనబడ్డంలేదు. అనుకున్నది సాధించగలనన్న నమ్మకం ఆ కళ్ళలో కనిపిస్తున్నది.

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. నాగు సామాన్యుడు కాదు.

"లోన్ గురించేకదా మీ రభస అంతా—మీ కాగితాలన్నీ చూపించండి ఒకసారి చూస్తాను...." అన్నాడు సుబ్బారావు.

"ఈ ప్రశ్న మీనుంచి చాలా ఆలస్యంగా వచ్చింది. అయినా ఫరవాలేదులెండి. కానీ ఒక్క విషయం ముందుగానే తమకు మనవి చేసుకుంటున్నాను. కాగితాలన్నీ సక్రమంగా లేవు. మీరు చూసీచూడనట్లూరుకుంటే తప్ప

లోన్ శాంక్షనవదు—" అన్నాడు నాగు.

"అలా కదరదు—అప్పుడు నా ఉద్యోగానికే ముప్పు వస్తుంది!"

"ఇంకా స్వ దారిలో పడుతున్నారు. తప్పుచేస్తున్నానని కాక—తప్పు మీకు తేబోయే ముప్పు గురించి భయపడుతున్నారు. మీకు ఏ ముప్పురాకుండా నేను చూసుకుంటాను. అదెలాగంటే.... రేపు నేను మీ ఆఫీసుకు వస్తాను. ఈ వేషంలో కాదు. మారువేషంలో. నా పేరు రంగనాథ్ అని చెబుతాను. మీతో కబుర్లు చెబుతూ రెండుగంటలవరకూ కాలక్షేపం చేసే అవకాశం నాకివ్వండి. మధ్యలో వాచ్‌మన్‌ని పిలిచి నాకు పరిచయమయ్యేలా చూడండి. మిగతా సంగతి నేను చూసుకుంటాను. మీకే ఇబ్బందీ వుండదు. మీ అమ్మాయి పెళ్ళి వాసుదేవరావుతో జరిగిపోతుంది—" అన్నాడు నాగు.

"ఇంతకీ మా వాళ్ళెక్కడున్నారు?" అన్నాడు సుబ్బారావు.

"ఈ రాత్రికి రారు. మీ అబ్బాయి కూడా అక్కడే వున్నాడు కాబట్టి మాకే అనుమానాలూ అక్కర్లేదు. వాళ్ళను మర్యాదగా చూసుకునేందుకు ఏర్పాట్లు చేశాను. రేపు నా పని ముగియగానే వాళ్ళు క్షేమంగా మీ యింటికి చేరుకుంటారు...." అన్నాడు నాగు.

"చేరుకోకపోతే—" అన్నాడు సుబ్బారావు అనుమానంగా.

"వాళ్ళతో నాకేం పని—కేవలం లోన్ కోసమేగదా నేనీ తంటాలు పడుతున్నది—" అన్నాడు నాగు.

"నిజమే—కానీ నా భయం నాకుండవచ్చుగదా-" అన్నాడు సుబ్బారావు.

"ఈ నాగు జామచెట్టుకు ఆపిల్సు కాయిస్తాడు. కానీ ఆడినమాట మాత్రం తప్పడు."

6

"అమ్మా! నన్ను అప్సర పిలుస్తున్నది—" అన్నాడు సురేంద్ర.

"బాగుంది నాయనా—ఆ అమ్మాయి పిలవడమూ—నువ్వు వెళ్ళడమూ—" అంది సులోచన చిరాగ్గా.

మహాలక్ష్మి నవ్వి—"చూడండి వదినగారూ—మన మెలాగూ వియ్యమందబోతున్నాము. ఈనాటి కుర్రాళ్ళ సంగతి మనకు తెలియదు. వాళ్ళకేమేం మాట్లాడుకోవాలనుకుంటుందో-ఏకాంతంలో మాట్లాడుకోవడమే బాగుంటుంది—" అన్నది.

సులోచన ఇబ్బందిగా నవ్వి—"మగపిల్లల విషయంలో నాకంత పట్టింపు లేదుకానీ — ఆడపిల్లల విషయంలో మాత్రం ఇలా నచ్చదు నాకు. మీ అమ్మాయి విషయం మీ యిష్టంకానీ"....అని ఆగిపోయింది.

వాసుదేవరావు కూడా—"ఏ ఏకాంతమైనా పెళ్ళయ్యాక—మా మాటలకు ఏకాంతం అక్కర్లేదు—" అన్నాడు.

"మీ అమ్మాయిమీద మీకు నమ్మకం లేకపోతేసరే-మా అమ్మాయిమీద నాకా మాత్రం నమ్మకముంది—" అన్నది మహాలక్ష్మి.

"మనిషిని నమ్మొచ్చుకానీ వయసును నమ్మకూడదు పిన్నీ—" అన్నాడు వాసుదేవరావు. వీళ్ళ మాటలు జరుగుతుండగానే సురేంద్ర ఏకాంతానికి పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. గదిలో అప్సర కూర్చుని వుంది.

"అంతమందిలో మీతో మాట్లాడాలంటే నాకు

సిగ్గు—" అన్నదామె.

"అంతమంది వుండగా మనమిద్దరమూ ఏకాంతంగా ఇక్కడ వున్నామంటే సిగ్గుగా లేదా?" అన్నాడు సురేంద్ర.

"లేదు—" అంది అప్సర అదోలా నవ్వుతూ—"మీతో ఏకాంతమంటే నేను సర్వమూ మరిచిపోతాను. ఒక మగవాణ్ణి ఇంతలా ప్రేమిస్తానని మిమ్మల్ని చూసే దాకా అనుకోలేదు—"

సురేంద్ర ముఖంలో గర్వం తొంగిచూసింది-"బయట అమ్మ కూర్చుని వుంది. అందుకని నాకు కాస్త సిగ్గుగానే వుంది—"

"మీకంత సిగ్గుగా వుంటే వాళ్ళకక్కనిపించేలా గది గుమ్మం దగ్గర కూర్చుందాం-" అంది అప్సర. సురేంద్రకది సబబనిపించింది. ఇద్దరూ గది గుమ్మందగ్గర కూర్చుని కబుర్లారంభించారు.

సురేంద్ర తల్లి సులోచన ఆశ్చర్యంగా ఆ జంటనే చూస్తోంది. అప్సర వ్యవహారం ఆమెకు నచ్చలేదు. పెళ్ళి కాకుండా పరాయి మగాడితో ఏకాంతాన్నభిలషిస్తున్న అప్సరా, ఈ విషయాన్ని పూర్తిగా సమర్థిస్తున్న అప్సర తల్లి మహాలక్ష్మి ఆమెకు చాలా విచిత్రంగా తోచారు. అసలారోజు మధ్యాహ్నంనుంచీ ఆమెకు తెలిసిన వివరాలన్నీ ఆశ్చర్యజనకంగానే వున్నాయి.

వాసుదేవరావు మహాలక్ష్మికి అక్క కొడుకు. పిన్ని బాబాయిలంటే అతను ప్రాణం ఇస్తాడు. ఎలాపడ్డాడో సురేంద్ర అప్సర ప్రేమలోపడ్డాడు. సంగతి తెలిసిన వాసుదేవరావు వీళ్ళ ప్రేమ ఫలింపజేయడంకోసం తను కట్నం లేకుండా దేవీబాలను పెళ్ళిచేసుకోవాలను

ఉన్నాడు. ఈ మాటలు మాట్లాడ్డానికే మహాలక్ష్మి తన్ను వచ్చి పిల్చికెళ్ళింది. మహాలక్ష్మి భర్త — తన భర్తను పిల్చుకురావడానికి బ్యాంకుకు వెళ్ళాడట. మనిషింకా తిరిగిరాలేదు కానీ కబురు వచ్చింది. సుబ్బారావు తను వచ్చేసరికి కాస్త ఆలస్యమైనా యెదురుచూస్తూ అందర్నీ ఇక్కడే వుండమన్నాడట.

సాయంత్రం ఏడుగంటలైనా భర్త రాలేదు. సురేంద్రను పంపి కబురు తెలుసుకోమందామా అంటే— అతడికి కదిలే మూడ్ వున్నట్లు లేదు. అప్సరతో కబుర్లు చెబుతూ అక్కణ్నించి కదలడానికేమాత్రమూ సుముఖంగా లేడు. సాయంత్రమైనప్పట్నించీ — సులోచనకు ముళ్ళమీద కూర్చున్నట్లుంది. టైము ఎనిమిదిన్నరయ్యేక ఆమె మహాలక్ష్మితో—"చూడండి—మరీ ఆలస్యమైపోతోంది—ఎందువల్లనో ఆయనింకా రాలేదు. నేను మళ్ళీ మరోసారి వస్తాను—" అని లేచింది.

మహాలక్ష్మి కూడా పెద్దగా అభ్యంతరపెట్టలేదు— "సరేలెండి వదినగారూ — మీకిష్టమైతే మా యిల్లు చిన్నదేం కాదు. మీకు పక్కలూ అవీ ఏర్పాటుచేసేస్తాను. మీకు వెళ్ళిపోవాలంటే మాత్రం నాకేమీ అభ్యంతరం లేదు—"

సురేంద్ర కూడా అయిష్టంగానే అక్కణ్నించి కదిలాడు. దేవీబాల తల్లినీ, అన్ననూ అనుసరించింది.

7

సుబ్బారావు ఆశ్చర్యంగా చూశాడు. ఆయనకు నమ్మ శక్యం కాలేదు—"ఎక్కణ్నించి వస్తున్నారు?" అనడిగాడు కుటుంబాన్ని.

సుమారు పావుగంట వ్యవధిలో ఆ రోజు జరిగిన

వివరాలన్నీ తెలిశాయాయనకు. తన భార్యాబిడ్డలు వాళ్ళకు తెలియకుండానే ఇంతవరకూ నిర్బంధంలో వున్నారని గ్రహించడానికాయనకెంతోసేపు పట్టలేదు.

"అయితే తప్పకుండా ఆ యింటికోసారి వెళ్ళి రావాలి—" అన్నాడు సురేంద్రవంక చూస్తూ ఆయన. ఆ యింటికి మరోసారి వెళ్ళాలని సురేంద్ర మనసులో కూడా వుంది. అతను వెంటనే అంగీకార సూచనగా తలాడించాడు.

"కాస్త ఎబ్బెట్టుగా తోచినా—వాళ్ళు మంచివాళ్ళే అనుకుంటానండీ. మర్యాదలు బాగానే చేశారు—" అంది సులోచన భర్త వెళ్ళడానికి అంగీకారాన్ని సూచిస్తూ.

సురేంద్ర, సుబ్బారావు కలిసి మళ్ళీ ఆ యింటికి వెళ్ళారు. సుబ్బారావు కాస్త వెనుకగా నిలబడివుండగా సురేంద్ర వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు. మరుక్షణం లోనే తలుపు తెరుచుకుంది. సురేంద్రను చూసి—"మీరు మళ్ళీ నాకోసం వస్తారని అనిపించింది. మనది జన్మజన్మల అనుబంధమనుకుంటాను—" అంది తలుపు తెర్చిన అప్సర.

"మా నాన్నగారు కూడా వచ్చారు—" అన్నాడు సురేంద్ర మనసులో మాత్రం అప్సర దర్శనం త్వరగానే అయినందుకు సంతోషపడుతూ.

అప్సర ముఖంలో వెలుగు కనబడింది—"మా నాన్నగారుకూడా ఇప్పుడే వచ్చారు. లోపలకు రండి—" అంది. ముందు సురేంద్ర, వెనుక సుబ్బారావూ ఆ ఇంట్లో ప్రవేశించారు.

క్షణాలమీద ఆ యింటి సభ్యులతో సుబ్బారావుకు పరిచయమైంది. వాసుదేవరావాయనకు నమస్కరించి—

"ఇదివరలో కట్నం గురించి నొక్కించి మీ మనసు నొప్పించాను. మీరు నన్ను క్షమించాలి—" అన్నాడు.

సుబ్బారావు ఆశ్చర్యంలో వున్నాడు. ఆయనూహించిన ప్రకారం—మహాలక్ష్మి భర్త—నాగు అయివుండాలి. కానీ ఆయన అంచనా తప్పయింది. మహాలక్ష్మి భర్త పేరు సూర్యనారాయణ. ఆయనకూ నాగుకూ ఎక్కడా పోలికలు లేవు. మనిషి చూస్తే చాలా అమాయకుడిలా గున్నాడు. ఆ యింట్లో పదినిమిషాలు గడిపితే—యింటి వ్యవహారాలన్నీ భర్త జోక్యం లేకుండా మహాలక్ష్మి తనే చూసుకుంటుందని అర్థమైపోతుంది. సుబ్బారావుగారు పదినిమిషాలేం కర్మ — సుమారు అరగంటసేపక్కడ గడిపాడు.

అప్సర తన కథ ఆయనకు వివరంగా చెప్పేసింది. తనూ, సురేంద్రా ప్రేమించుకున్నారు. పెళ్ళి ప్రసక్తి ఎత్తేసరికి తన తలిదండ్రులకు కట్నం పట్టింపు బాగా వున్నదని సురేంద్ర చెప్పేశాడు. ముఖ్యంగా చెల్లె పెళ్ళి కోసం కట్నం చాలా అవసరపడిందని అతడు చెప్పి— కట్నం లేకనే—వాసుదేవరావుతో పెళ్ళి ఆగిపోయిన ఉదంతం చెప్పాడు. వాసుదేవరావు వివరాలు విన్న మీదట—అతడు తన పెద్దమ్మ కొడుకేనని అప్సర గ్రహించింది. వాసుదేవరావు చదువంతా మహాలక్ష్మి ఇంట్లోనే అయింది. వాళ్ళ అనుబంధం చెప్పుకోతగ్గది. వెంటనే ఆమె తల్లికి అన్ని వివరాలూ చెప్పింది. వాసుదేవరావుకు కబురు వెళ్ళింది. అతను వచ్చాడు.

ఈ కథలన్నీ వింటూంటే—నాగుకీ వీళ్ళకీ సంబంధముండి వుండవచ్చునని సుబ్బారావుకు అనిపించడంలేదు. అలా అని అంతా కాకతాళీయంగా జరిగిందన్నా నమ్మ

బుద్ధి కావడంలేదు.

"మీ అభిప్రాయం చెప్పండన్నగారూ—" అంది మహాలక్ష్మి.

సుబ్బారావు సాలోచనగా — "మా ఆవిడా నేనూ ఉండగా మాటలు జరిగిపోయుంటే బాగుండేది. నేను రోజల్లా బ్యాంకులో నే వున్నాను. కబురు పంపాల్సింది" అన్నాడు.

"ఎదురింటి కుర్రాడిని కబురు పంపాం. అతడు మీతో కబురు చెప్పాననే అన్నాడు. అందుకే మీ గురించి చాలా సేపు ఎదురుచూశాం. ఆయనేమో ఊళ్ళోలేరు. ఆ విషయం వదినగారికి చెప్పలేదు. మొగుడు లేకుండానే వ్యవహారాలు చక్కబెట్టేస్తోంది అని అనుకుంటారని భయపడి — ఆయనే బ్యాంకుకు వెళ్లారని వదినగారికి చెప్పాను. వాసుదేవరావు రేపు వెళ్ళిపోవాలి. అందుకని తొందరపడ్డాను. అదృష్టం బాగుంది. ఆయనా వచ్చారు. మీరూ వచ్చారు—" అంది మహాలక్ష్మి.

విషయం నిజంగానైనా జరిగుండాలి—లేదా మహాలక్ష్మికి అబద్ధాలాడ్డంలో చాలా నేర్పుండి వుండాలని అనుకున్నాడు సుబ్బారావు.

ఎవరో చాలా పెద్ద నాటకం ఆడుతున్నారు. ఈ నాటకానికి చివరి అంతం రేపు వస్తుంది. అప్పుడేదో జరుగుతుంది. దాని ఫలితంగా తన బ్యాంకు కొన్ని లక్షలు నష్టపోతుంది.

రేపు ఏం జరగబోతోంది?

"అన్నయ్యగారు మాట్లాడడంలేదు—" అన్నది మహాలక్ష్మి.

బ్యాంకుకు సంబంధించి పెద్ద చిక్కులో పడ్డాను. ఆ

సమస్య తేలేవరకూ కుటుంబ వ్యవహారాల గురించి ఆలోచించే పరిస్థితిలో లేను. మీకు సంబంధించినంతవరకూ అభ్యంతరం చెప్పడానికి కారణమేమీ కనబడ్డంలేదు. అయినా నేను వెంటనే ఏ మాటా చెప్పకపోవడానికి కారణం ఒక్కటే—ఒక్కసారి నేను మాటిచ్చానంటే మరి తిరుగుండదు!" అన్నాడు సుబ్బారావు.

"సరేలెండి — మీ యిబ్బందులేవో మీకుంటాయి. మీకు వీలుకాగానే చెప్పండి. అటు అమ్మాయీ ఇటు అబ్బాయీ ఇష్టపడ్డ సంబంధమొకటి. ఒకసారి అనుకున్నదే అయిన సంబంధమింకోటి—ఈ రెండూ సెటిలై పోవడానికింక మీరు ఊఁ అనడం మాత్రమే అడ్డు—" అన్నాడు సూర్యనారాయణ.

"సూర్యనారాయణగారూ — మీ ఎదురింటి కుర్రాడినోసారి కనుక్కొని — నాకెందుకు కబురు చెప్పలేదో, చెప్పేనని ఎందుకబద్ధమాడాడో అడిగి తెలుసుకోండి. ఆ సమాచారం నాకు చాలా అవసరం—" అన్నాడు సుబ్బారావు.

"ఆఁ ఎందుకులెండి వృధాశ్రమ — తను చెప్పలేదని ఆ కుర్రాడొప్పుకుంటాడేమిటి?" అంది మహాలక్ష్మి.

సుబ్బారావు మరి నొక్కించకుండా — "సరేలెండి, మళ్ళీ వస్తాను—"అని లేచి వెళ్ళిపోయాడు. సురేంద్ర ఆయన్ననుసరిస్తూన్నప్పుడు—ఎవరూ చూడకుండా అప్సర ఒకసారి అతడి చేయి నొక్కి వదిలింది.

8

"హలో—సుబ్బారావుగారేనా మాట్లాడుతూంట-"

"అవును—ఎవరది?

"నాగు చెప్పే వుంటాడు. నా పేరు రంగనాథ్—"

సుబ్బారావుకు క్షణం మాటరాలేదు—"చెప్పాడు—" అన్నాడు క్షణం ఆగి.

"అన్నీ గుర్తున్నాయి కదా-ఏమీ మర్చిపోరు కదా-"

"నేను బాధ్యతగల ఉద్యోగిని. నా బాధ్యతలు నే నెప్పుడూ మరిచిపోను—" అన్నాడు సుబ్బారావు గంభీరంగా.

"మంచిది. కానీ మనిషి ఉద్యోగం చేసేది బ్రతకడం కోసమేనని వేరే నేను చెప్పక్కర్లేదు. జీవితంపట్లకూడా మీకు చాలా బాధ్యతలున్నాయి. అవీ మీరు మరిచిపో కూడదు. గోటితోనూ, తల వెంట్రుకతోనూ పోయే విషయాన్ని తలకాయదాకా లాగకండి—నాకు హెచ్చ రికలన్నీ గుర్తుంచుకోండి—"

కంఠం కాస్త కటువుగా ధ్వనించగా సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. ఆయనకు పిల్లలు, భార్య-వీళ్ళే జీవితం. వాళ్ళకు ఊహాలో ఆపద కలిగినా భరించలేడు.

"సుబ్బారావుగారూ—మీ సంగతి నాకు పూర్తిగా తెలుసును. మీమీద గౌరవంతో, పూర్తి నమ్మకంతో—మీ భార్యాబిడ్డలు ముందుగానే మీ యింటికి చేరే ఏర్పాటు చేశాను. రేపు నేను ఫెయిలయ్యానంటే—మీ కుటుంబం ఏమైపోతుందో నాకే తెలియదు. ఎందుకంటే కోపంలో నేనేం చేస్తానో నాకు తెలియదు—"

"బెదిరింపా?"

"కాదు — సమాచారం! ముందుగానే ఈ సంగతి తెలిసుంటే జాగ్రత్తపడేవాడినని తర్వాత మీరు విచా రించకుండా—ఈ సమాచారాన్నందిస్తున్నాను. మనం ఒకపని చేయబోయేముందు పూర్వాపరాలాలోచించాలి

గదా—అలా ఆలోచించడానికి సమాచారం రావాలి గదా—అదే నేను మీకు చెప్పాను—"

"సరే—థాంక్స్—"

"నో మెన్షన్! మీరేమీ కంగారు పడకండి—ఎట్టాచ్చీ రేపు కూడా మీ పనులన్నీ ఎప్పటిలాగే చేసుకోండి. పోలీసుల గురించిన ఆలోచన బుర్రలోకి రానీయకండి. పోలీసులు హంతకుల్ని పట్టుకోగలరుకానీ హత్యల్ని ఆపలేరు. మీ ధ్యేయం హత్యలు జరుగకూడదనే కదా."

"సరే—రేపు నేను చేయవలసినదంటూ స్పెషల్‌గా ఏమీ లేదుగదా—"

"ఏమీ లేదు. నాకు చెప్పినట్లు చేస్తే చాలు. మిగతావన్నీ నేను చూసుకుంటాను—"

"మీ కబుర్లూ, చేతలూ చూస్తూంటే ఆరితేరినవారిలా గున్నారు—నా సహాయం అవసరం లేకుండానే మీ పనులు మీరు ముగించుకోగలరేమో—ఎందుకీ రిస్కు తీసుకుంటున్నారు?"

"ఆ రిస్కుకంటె—ఈ రిస్కే మంచిది. మా గురించి తెలియని వాళ్ళకి మేమంటే అంత భయముండదు. తెలిసినవాళ్ళలో ఏ ఇబ్బందీ ఉండదు. అందుకే...."

"అయ్‌సీ...." అని—"మరి నేను సెలవు తీసుకోవచ్చా?" అన్నాడు సుబ్బారావు.

"అలాగే—మీరు సాయపడ్డందుకు మీ ఋణముంచుకోములెండి. మీ యింట త్వరలోనే వైభవంగా కల్యాణాలు జరుగుతాయి—"

అవతలవైపు క్లిక్‌మంది. సుబ్బారావుకూడా ఫోన్ పెట్టేశాడు.

9

ఉదయం లేస్తూనే సుబ్బారావు భార్యను పిలిచాడు. ఆయనకు రకరకాల ఆలోచనలలో రాత్రి తెల్లవార్లూ నిద్రపట్టలేదు.

సులోచన హడావుడిగా వచ్చి-"మెలకువొచ్చిందా?" అంటూ పలకరించింది.

"వచ్చింది కానీ అందరూ త్వరగా తెమలండి. ఈ రోజు మీరందరూ నాతోపాటే బయల్దేరాలి—" అన్నాడు సుబ్బారావు.

"అదేమిటండీ—" అంది సులోచన ఆశ్చర్యంగా.

"కారణం ఇది అని చెప్పలేను కానీ — ఏదైనా ప్రమాదం జరుగవచ్చునని నాకు భయంగా వుంది. ఈ రోజు మీరెవ్వరూ ఇంట్లో వుండిపోవద్దు. అమ్మాయేమో కాలేజీలో రోజుల్లా ఫ్రెండ్సుతోనే గడపాలి. యెవరు వచ్చి పిల్చినా వెళ్ళకూడదు. అలాగే అబ్బాయి ఆఫీసులో తనతోటి ఉద్యోగస్థులతో గడుపుతాడు. నువ్వు ఇన్స్పెక్టర్ మధుమూర్తి యింట్లో కాలక్షేపం చేద్దువుగాని. బాగా ఆలోచించే నేనీ నిర్ణయానికి వచ్చాను. ఎందుకని అడగొద్దు. ఇంకేమీ చెప్పొద్దు—" అన్నాడు సుబ్బారావు.

సులోచన ఆశ్చర్యంగా భర్తవంక చూసింది. వేళాకోళంగా ఏదో అనబోయి ఆయన ముఖం గంభీరంగా వుండడం చూసి ఇంకేమీ మాట్లాడలేదు. పదికి లోపుగానే అందరూ బయల్దేరాల్సిన అవసరముండడంవల్ల పనులన్నీ తొందరగా చేయడంకోసం లోపలకు పరుగెత్తింది.

అయితే టైము సుమారు పావు తక్కువ తొమ్మిది

అవుతున్న సమయంలో ఎవరో వీధి తలుపులు తట్టారు. సుబ్బారావే స్వయంగా వెళ్ళి తలుపులు తీశాడు.

"నమస్కారం — అన్నయ్యగారూ—" అంటూ మహాలక్ష్మి, ఆమె వెనుకే అప్సర లోపలకు ప్రవేశించారు.

"రండి—రండి—" అన్నాడు సుబ్బారావు ఏమనాలో తెలియక.

"నిన్న జాతకాల విషయం మరిచిపోయాను. నాకు జాతకాల పట్టింపు బాగా వుంది. అమ్మాయికీ అబ్బాయికీ జాతకాలు సరిపోయిందీ లేనిదీ చూసుకోకుండా—మనం మాటలు జరుపుకుని ఏం లాభం?" అంది మహాలక్ష్మి.

"దీనికి మీరు పనిగట్టుకుని రావాలా? ఎవరిచేతనైనా కబురు పంపితే — మీ ఇంటికి నేనే పంపి ఉండే వాణ్నిగా—" అన్నాడు సుబ్బారావు మనసులో చిరాకును బయటపడనీయకుండా జాగ్రత్తపడుతూ.

"వాసు పొద్దున్నే బయలేదేరి ఊరెళ్ళిపోయాడు. ఆయనకు పెందరాళే ఆఫీసు. మళ్ళీ రాత్రిదాకా రారు. నాకేమో అనుకున్న పని వెంటనే అయిపోతే కానీ నిమ్మళంగా వుండదు. పోనీ ఏ ఎదురింటి కుర్రాడినైనా పంపిద్దామా అంటే — నిన్నటి అనుభవంతో బాగా బుద్ధొచ్చింది. అందుకే అమ్మాయిని తీసుకుని బయల్దేరి వచ్చాను—" అంది మహాలక్ష్మి.

ఈలోగా సులోచన అక్కడకు వచ్చి మహాలక్ష్మిని చూసి తెల్లబోయింది.

"గుర్తుపట్టేరా—అప్పుడే మరిచిపోయారా—" అంది మహాలక్ష్మి.

"ఎంతమాట?" అంది సులోచన నొచ్చుకుంటున్నట్లు.

"అబ్బాయి జాతకాలకోసం వచ్చారు. పాపం

పొద్దున్నే బయల్దేరి వచ్చారు. త్వరగా వెళ్ళిపోవాలో ఏమిటో—" అన్నాడు సుబ్బారావు అసహనంగా.

"అయ్యో—అంత తొందరేం లేదండీ—పొద్దున్నే మీ కాఫీనూ అదీ హడావుడిగా వుంటుందని నాకు తెలుసుగదా—మేమేమీ కాళ్ళలో చెప్పులు పట్టుకుని రాలేదు. కాసేపుండే వెడతాం. ఇవన్నీ ఆలోచించి—మా పురోహితుడికూడా ఈ యింటి అడ్రసిచ్చాను. పదకొండు గంటల ప్రాంతంలో ఆయనిక్కడికి వచ్చి—జాతకాలు పరీక్షిస్తాడు—" అంది మహాలక్ష్మి.

"అంత సేపు మీరుండే పక్షంలో ఏకంగా భోంచేసి వెడితే బాగుంటుంది. కానీ కతికితే అతకదంటారు...." అన్నాడు సుబ్బారావు నీళ్ళు నములుతూ.

"శాస్త్రాలంటే మీకంటే నాకే ఎక్కువ పట్టింపండోయ్—మా అమ్మాయి చేతిలోని బ్యాగు మీరు చూడలేదు. దాంట్లో స్వయంపాకముంది. ఇంత ఉడకేసుకుని ఇక్కడే తినివెడతాం—అనుకున్నపని అయ్యేదాకా నేను చాలా పట్టుదలగా వుంటాను—" అంది మహాలక్ష్మి.

"కానీ...." అని సుబ్బారావేదో అనబోతూంటే సులోచన వారించి—"బయటకు వెడదామనుకున్నాం లెండి. అంత ముఖ్యమైన పనేంకాదు. ఈవేళ కాకపోతే రేపైనా వెళ్ళవచ్చు—" అన్నది.

సుబ్బారావుకు మనసులో బెంగగా వున్నది. మహాలక్ష్మి అసాధ్యురాలనీ నాగు వ్యూహంలో ఆమె భాగస్థురాలనీ ఆయనకు బాగా అనుమానంగా వున్నది. తను ఇల్లు కదలగానే వీళ్ళు ఏంచేస్తారోనని ఆయనకు భయంగా వుంది.

కానీ ఇప్పుడు—ఈ పరిస్థితుల్లో సులోచనను బయట

మనో ఇంట్లో వుండడం కూడా అంత శ్రేయస్కరంకాదని ఆయనకు అనిపించింది. మహాలక్ష్మి శత్రువుల మనిష యుంటే—ఆమె అనుసరించి సులోచన ఉనికి తెలుసుకుంటుంది. శత్రువుల మనిషి కాని పక్షంలో ఆమె ఇంట్లో ఉండడం సులోచనకు అధిక రక్షణ అవుతుంది. ఏది ఏమైనా సులోచనను ఇల్లు కదపడం మంచిదికాదని ఆయనకు తోచింది. అయితే ఆమెకు రక్షణ అవసరం.

ఆయన కొడుకు సురేంద్రను పిలిచి — "ఈ రోజు నువ్వు ఆఫీసుకు సెలవు పెట్టేస్తే మంచిది...." అన్నాడు. అంతకంటే యెక్కువ ఆయన వివరించనవసరంలేక పోయింది.

ఆయన మాటలు వింటూనే సురేంద్ర—"ఎలాగూ నేను సెలవు పెట్టేద్దామనుకుంటున్నాను. యెందుకో హఠాత్తుగా తల బద్దలైపోయేటంత నొప్పిగా వుంది—" అన్నాడు.

సుబ్బారావు కంగారుగా కొడుకువంక చూసి— "ఏమయింది? ఈ తల నొప్పి రాత్రినుంచీ వున్నదా— ఉదయమే ప్రారంభమయిందా — ఏదైనా తిన్నాక మొదలయిందా.... వెంటనే ఓసారి డాక్టర్ని కలుసుకుంటే...." అని ఇంకా ఏదో అనబోతూంటే సురేంద్ర కంగారుపడ్డాడు. అప్పరకోసం తనేదో వంక పెట్టి ఇంట్లో వుండిపోదామనుకుంటూంటే తన తల నొప్పి నిజమే అనుకుని తండ్రి కంగారుపడిపోతున్నాడు.

"అబ్బే—మరీ అంత కంగారు అవసరం లేదులెండి— ఇప్పుడిప్పుడే కాస్త నెమ్మదిస్తోంది. రాత్రి సరిగ్గా నిద్ర పట్టక అలాగుందనుకుంటాను. ఈ రోజుకు విశ్రాంతి తీసుకుంటే అన్నీ అవే సద్దుకుంటాయి—" అన్నాడతను.

కూతుర్ని కూడా ఇంట్లో వుండిపొమ్మని సలహాయిస్తే- దేవీబాల వినలేదు. ఆ రోజు చాలా ముఖ్యమైన క్లాసులున్నాయనీ — మిస్సు కావడానికి వీల్లేదనీ నొక్కి చెప్పింది. అయితే యెక్కడికీ వెళ్ళవద్దనీ, కేవలం తనకు తెలిసిన స్నేహితురాండ్రతోనే గడపాలనీ — సాయంత్రం తిన్నగా ఇంటికొచ్చేయమనీ మరీ మరీ చెప్పాడు సుబ్బారావు. తండ్రి ఆ రోజు మరీ అంతలా యెందుకు చెబుతున్నాడో అర్థంకాకపోయినా — దేవీబాల అంగీకార సూచకంగా తలూపింది.

10

"వదినగారూ — పురోహితుడు రావడానికింకా చాలా టయివుంది. కాస్త కత్తిపీటిలా పారేయండి. కూర తరుక్కుంటాను —" అంది మహాలక్ష్మి.

"ఏం కూర తెచ్చుకొచ్చారేమిటి?" అంది నవ్వుతూ సులోచన.

"వంకాయలు. ఎలా వండుకున్నా బాగుండే కూర అదొక్కటేకదా...." అని నవ్వింది మహాలక్ష్మి. సులోచన కత్తిపీట తెచ్చి ఆవిడకిచ్చి ముచ్చటగా ఆవిడనే చూస్తూ కూర్చుంది.

బ్యాంగులోంచి మూడు సీటొంకాయలు తీసింది మహాలక్ష్మి. వాటిని తరుగుతూ కబుర్లు మొదలెట్టింది — "నాకు రుచి మహాపట్టింపులెండి — ఉల్లికారం కూర చాలా ఇష్టం నాకు. యెలాగూ బ్యాగు తెస్తున్నాంకదా అని కాసిని ధనియాలు, నాలుగుల్లిపాయలూ వగైరాలన్నీ మూటకట్టుకొని వచ్చాను. కూర కూడా నేను చాలా బాగా చేస్తాను. వాసన చూస్తేనే నోరూరిపోతుంది. అలాగని తొందరపడి మీరు మాత్రం రుచి చూడకండి. వతికితే

అతకదంటారుకదా—"

మహాలక్ష్మి అతి చనువు ఇబ్బందిగానే వున్నా—అరమరికలు లేని ఆవిడ మన స్తత్వమూ — ఆవిడ చెప్పే సరదా కబుర్లూ సులోచనను బాగా ఆకర్షించాయి. ఈవిడ వియ్యపురాలయితే బాగానే వుంటుందని ఆమెకూ తోచింది. ఆమెతో అవీ యివీ కబుర్లు చెబుతూనే మహాలక్ష్మి ఘుమఘుమలాడే వంకాయ కూర చేసింది. తనతో కూతురికీ మటుక్కే అన్నం వండింది. కూడా తెచ్చుకున్న క్యారియర్లోని కొంత పెరుగుతీసి మెంతి మజ్జిగ పెట్టింది. నంజుకుందుకు చిన్న సీసాలో ఊరగాయ కూడా తెచ్చుకొచ్చిందావిడ.

సుమారు పదకొండు గంటల ప్రాంతంలో పురోహితుడు వచ్చాడు. ఆయనెంతో సేపుండలేదు. సురేంద్ర, అప్సరల జాతకాలు పరీక్షించి—అద్భుతంగా సరిపోయాయన్నాడాయన. ఆ జాతకాలు చూసేక కాబోయే వధూవరులను చూడాలన్న కోరిక కూడా ఆయనకు కలిగింది. వేరే గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న అప్సర, సురేంద్ర ఆయన కోరిక మేరకు వచ్చి దర్శనమిచ్చారు.

"జాతకాలనుబట్టే అనుకున్నాను. ఇది అద్భుతమైన జంట—" అన్నాడు పురోహితుడు. ఈలోగా బాత్రూమ్ వివరాలడిగి తెలుసుకుని—అప్సర అక్కడికి వెళ్ళివచ్చింది. ఆమె తిరిగి వచ్చేసరికి పురోహితుడు సెలవు తీసుకుంటున్నాడు. అప్సరను చూస్తూనే మహాలక్ష్మి-"అమ్మాయ్ నీ చేతికున్న ఆ గాజు ఆయనకు మొదటి బహుమతిగా ఇచ్చేయమ్మా—" అన్నది.

అప్సర ఎడమ చేతికి ఒక లావుపాటి వెండిగాజు వున్నది. తల్లి మాట వింటూ నే ఆమె గాజుతీసి తల్లి కిచ్చేసి — "నీ చేత్తో నువ్వే ఇయ్యమ్మా—" అన్నది. మహాలక్ష్మి ఇవ్వగా—"మహా ప్రసాదం—" అని అంది పుచ్చుకుని పురోహితుడక్కణ్నించి వెళ్ళిపోయాడు. వెళ్ళి పోయే ముందు త్వరలో నే కళ్యాణం జరగాలని అప్సరను ఆశీర్వదించి మరీ వెళ్లాడు.

పురోహితుడు కనుమరుగు కాగా నే మహాలక్ష్మికి ఎక్కడలేని ఆకలి పుట్టుకొచ్చింది. భోజనానికి రమ్మంటే అప్సర మాటలు భోంచేస్తున్న సురేంద్రకు ఆకలే లేకుండా పోయింది. అప్సర తనకూ ఆకలి లేదన్నది. ఆ కారణంగా మహాలక్ష్మికి తోడుగా సులోచన కూడా భోజనం చేసేసింది. భోజనాలు పూర్తికాగా నే సురేంద్రను పిలిచింది సులోచన. ఈసారి సురేంద్రకూ, అప్సరకూ కూడా ఆకలి వేసింది.

కొడుక్కి త్వరగా పెళ్ళి చేసేయాలని మనసులో అనుకున్నది సులోచన. లేకపోతే ఆడవాళ్ళంటే ఎంతో మొహమాటపడే సురేంద్ర అప్సర వంక ఆవురావురు మంటూ చూడడమేకాక ఆమెతో ఏకాంతం కోసం తెగ తంటాలు పడిపోతున్నాడు. ఇంట్లో తల్లి కూడా వుందన్న విషయమే అతడి దృష్టిలో వుండడంలేదు.

సురేంద్ర, అప్సర భోజనాలు చేస్తూండగా ఇంట్లో టెలిఫోన్ మ్రోగింది. సులోచన రిసీవర్ ఎత్తింది.

అవతలనుంచి సుబ్బారావు మాట్లాడుతున్నాడు. అంతా క్షేమంగా వున్నారనీ చెప్పుకోదగ్గ విషయాలేమీ జరుగలేదనీ విని ఆయన సంతృప్తిగా ఫోన్ పెట్టేశాడు.

11

సుబ్బారావు అసహనంగా వాచీ చూసుకున్నాడు. పనులన్నీ చూసుకుంటూనే వున్నా ఆయన మనసు మనసులో లేదు. రంగనాథ్ యెప్పుడు వస్తాడూ, యెలా వస్తాడూ—వచ్చి ఏం చేస్తాడూ అన్న ఆలోచనలనుంచి ఆయన తప్పించుకోలేక పోతున్నాడు.

ఈ విషయం ఆయనింతవరకూ పోలీసులకు చెప్పలేదు. తన భార్యాబిడ్డలకేదైనా అపకారం జరుగుతుందేమోనన్న భయం ఆయనలో ఓ మూల వుంది. పరిస్థితులనుబట్టి తనే అన్యాయాన్నెదుర్కోగలనన్న నమ్మకం కాస్త వుంది.

ఏది ఏమైనప్పటికీ ఆ రోజు మాత్రం ఆయన కాస్త టెన్షన్లో వున్నాడు. మధ్య మధ్యలో ఇంటికి ఓసారి ఫోన్ చేస్తున్నాడు. సులోచన కంఠం విన్నప్పుడల్లా ఆయనకు ధైర్యం కలిగి తను—అనవసరంగా కంగారు పడుతున్నానేమోనని అనుకోసాగాడు.

టైము ఒంటిగంటం పావయింది.

"హలో—సుబ్బారావుగారూ—కులాసానా—" అన్నారెవరో.

సుబ్బారావులిక్కిపడి చూశాడు. అతను...కాదు కాదు ఆయన....తనకు బాగా తెలుసును....ఆయన పేరు రంగనాథ్! ఆయనకు తన బ్యాంకులో అకౌంట్సున్నాయి. టర్నోవర్ లక్షల్లో వుంటుంది.

సుబ్బారావు బుర్ర పనిచేయడం మానేసింది. నాగు చెప్పిన ప్రకారం ఈ రోజు బ్యాంకుకు రంగనాథ్ అనే అతను రావాలి. ఆ రంగనాథ్ ఆరితేరిన గజదొంగ అని తను భావిస్తున్నాడు. ఇప్పుడు రంగనాథ్ నిజంగానే వచ్చాడు. అయితే ఈ రంగనాథ్ తనకు బాగా

తెలుసు. నగరంలో పేరు మోసిన వ్యాపార సుధీయున.

"రండి__కూర్చోండి__" అన్నాడు సుబ్బారావు.

రంగనాథ్ కూర్చుని__"ఏమిటలా చూస్తున్నారు?" అన్నాడు.

"ఏమీ లేదు __ మీకు నాగు తెలుసా?" అడిగాడు సుబ్బారావు.

"నాగా__అంటే ఎవరు?" అన్నాడు రంగనాథ్ ప్రశ్నార్థకంగా.

"అతడి పూర్తి పేరు నాగరాజారావు. యెరిగున్న వాళ్ళంతా అతన్ని నాగు__అని పిలుస్తారట__"

రంగనాథ్ కు గుర్తు వచ్చినట్లుంది__గలగలా నవ్వి__"అతనా__నాకు బాగా తెలుసు. చాలా ఫన్నీ ఫెలో-టీ కప్పుల్లో తుఫాను సృష్టించడం అతని హాబీ__" అన్నాడు.

"అంటే?" అన్నాడు సుబ్బారావు.

"ఎవరో ఒక వ్యక్తిని ఎన్నుకుంటాడు. వాళ్ళింట్లో జరగబోయే కొన్ని సంఘటనలు ముందుగానే తెలుసుకుని వాటికి విపరీతార్థంతో చే పరిస్థితులు కల్పిస్తాడు. ఆ మనిషి సందిగ్ధంలో తల మునకలవుతుంటే తను ఆనందిస్తాడు. ఒకసారేమయిందంటే...." క్షణం ఆగాడు రంగనాథ్.

"చెప్పండి__" అన్నాడు సుబ్బారావు.

"అతను నాకు ఫోన్ చేసి__ఈ రోజు రాత్రి నీ ఇల్లు దోస్తాను. ఆ దోపిడీ ఆపడం నీ తరం కాదు. నువ్వూహించలేని రూపంలో వస్తున్నాను__" అన్నాడు. ఫోన్ చేసిందెవరో నాకు తెలియదు. ఆ తర్వాత నేనింటికి ఫోన్ చేసి కనుక్కుంటే యెవరో అపరిచితుడు పెళ్ళి సంబంధం గురించి వివరాలకోసం వచ్చినట్లు మా ఇంటికి

వచ్చాడని తెలిసింది. అతన్ని వెయ్యి కళ్ళతో కనిపెట్ట వలసిందనీ, చాలా జాగ్రత్తగా వుండమనీ ఫోన్ చేశాను.

ఆ రోజు సాయంత్రం మా యింటికి నాగు కూడా వచ్చాడు. మేమూ—అపరిచితుడితో మా ప్రవర్తన చూసి అతడు చాలా వినోదించాడు. రాత్రి మా ఇంట్లోనే పడుకుని — మరి రెండు అనుమానాస్పద సంఘటనలు కూడా సృష్టించి—మమ్మల్ని మరికాస్త కలవరపరిచాడు. మర్నాటికే విశేషమూ జరక్కపోయేసరికి నా అనుమానం నాగుమీదకు మళ్ళి క్రమంగా బలపడింది. నిలదీస్తే ఒప్పే కున్నాడు నాగు..."

సుబ్బారావు క్షణం ఆలోచించి—"మీరు బ్యాంకుకు వస్తున్నట్లు నాగుకు తెలుసా?" అన్నాడు.

"తెలియకేం — రెండ్రోజుల క్రితమే తెలుసును. అతడికి సంబంధించిన పనిమీదనే నేనీరోజు బ్యాంకుకు వచ్చాను. ఓ యాభై వేలు విత్ డ్రా చేయాలి—" అన్నాడు రంగనాథ్.

సుబ్బారావు విచిత్రావస్థలో వున్నాడు. రంగనాథ్ తనకు బాగా తెలుసు. ఆయనిప్పుడేదో తమాషా చేస్తాడని ఆయననుకోవడంలేదు. కానీ నాగు మాటలు కేవలం నాటకమంటే ఆయన నమ్మలేకపోతున్నాడు. నిజంగా అవి నాటకమే అయితే—నాగు కృతకృత్యుడయ్యాడనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఒకటి రెండ్రోజులపాటు తను పడ్డ మానసికావస్థ సామాన్యమైనది కాదు.

12

"అమ్మా—బిచ్చం తల్లీ!" ముష్టివాడు ఇంటిముందు నిలబడి గట్టిగా కేక పెట్టాడు.

చెయ్యూర్యారుకో లేదనబోయింది సులోచన. మహాలక్ష్మి

ఆమెను వారించి—"తెచ్చుకున్న వాటిలో కాసిని బియ్యం మిగిలిపోయాయి. అవి వాడికిచ్చేస్తే సరిపోతుంది—" అని లేచి వీధిలోకి వెళ్ళి — "ఏరా — డబ్బాతో సహా కాసిని బియ్యమున్నాయి—పట్టుకెడతావా?" అంది.

"ఏం డబ్బా అమ్మా — ఇంట్లో బియ్యముంచుకునే పెద్ద డబ్బానా—లేక పిల్లల పాలపౌడుందే—గ్లాక్సో డబ్బానా?" అన్నాడు బిచ్చగాడు.

"ఏదైతే నీకెందుకు? ఇచ్చింది తీసికెళ్ళు—" అంటూ వాడికో అరకేజీ గ్లాక్సో డబ్బా దానం చేసింది మహాలక్ష్మి. డబ్బా పెద్దదే కానీ బియ్యం మాత్రం అందులో నాలుగో వంతుకూడా లేవు.

బిచ్చగాడికి దానం చెయ్యడమయ్యేక-మళ్ళీ సులోచన, మహాలక్ష్మి కబుర్లలో పడ్డారు. సులోచనకు కాస్త విసుగ్గా వుంది. ఈవిడ వాటంచూస్తే ఇప్పట్లో కదిలేటట్లు లేదు. అప్పుడే ఒంటిగంట దాటింది.

సులోచనకైతే కాసేపు మేను వాల్చాలనుంది. అది చూచినా ఆమె అవలించింది. మహాలక్ష్మి ఆమెవంక పరిశీలనగా చూసి—"మధ్యాహ్నం మీకూ నాకులాగే కాసేపు మేనువాల్చడం అలవాటనుకుంటాను. కాసేపు పడుకునే వెడతాలెండి — ఇప్పుడింటికి వెళ్ళి మాత్రం చేసేదేముంది కనుక—ఎలాగూ భోజనాలై పోయాయి-" అంది.

సులోచన సురేంద్రను కేకపెట్టి పిలిచింది. అతను వచ్చి ఇద్దరికీ చెరో మడత మంచం వేశాడు. ఈలోగా అప్సరకాబోయే అత్తగారికీ, తల్లికీ మంచినీళ్ళిచ్చింది. "మరి నాకో?"—అన్నట్లు చూశాడు సురేంద్ర. అతడికీ ఓ గ్లాసు మంచినీళ్ళిచ్చిందామె.

మహాలక్ష్మి మంచంమీద ఇటూ అటూ దొర్లుతోంది కానీ సులోచన కదలడంలేదు. వాళ్ళు నిద్రపోవడం కళ్ళారా చూసి కదలాలన్న సురేంద్రకు కనులు మూత పడుతున్నాయి. అతను అప్సరకు సైగచేసి—తన గదిలోకి వెళ్ళిపోయి—ఆమె వచ్చేలోగానే నిద్రకు పడ్డాడు. అప్సర వెళ్ళి నిద్రపోతున్న అతన్ని కదిపిచూసింది. యెక్కడా చలనంలేదు.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది. అప్సర పరుగున వెళ్ళి రిసీవర్ తీసింది.

"హాలో — సులోచ నేనా మాట్లాడుతూంట—" అంది సుబ్బారావు కంఠం.

"నేను—అప్సరని మామయ్యగారూ—అత్తయ్యగారిప్పుడే నిద్రకు పడ్డారు. లేపమంటావా?"

"అవసరం లేదులే అమ్మా—" అవతల ఫోన్ క్లిక్ మంది.

అప్సర చిన్నగా నిట్టూర్చి అక్కణ్నించి నెమ్మదిగా తల్లి వద్దకు వెళ్ళి—చిన్నగా—"అమ్మా!" అంది.

మహాలక్ష్మి చటుక్కున లేచి కూర్చుని—"సురేంద్ర నిద్రపోయాడా?" అన్నది.

"ఆహా—ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు."

"ఫోన్ ఎవరిదగ్గర్నుంచి—సుబ్బారావుగారా?"

"అవును—అత్తయ్యగారిని పిలిచారు—"

"ఆయనగానీ వస్తాడేమో—" అంది మహాలక్ష్మి.

"అవకాశాలున్నాయి...." అంది అప్సర.

మహాలక్ష్మి ఆలోచనలో పడింది — "ఇంకా ఇద్దరు రావాలి. వస్తే మనం వెళ్ళిపోవచ్చు—"

"నాలుగుదాకా అనుకున్నాంగదా—అంతవరకూ ఆగ

వలసిందే—"

"నాలుగు వరకూ రాకపోతే—మళ్ళీ ఇలాంటివకాశం దొరకదూ—?"

ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది.

"సుబ్బారావుగారేమో?" అంది మహాలక్ష్మి మంచం మీద వాలిపోతూ.

"నేను వెళ్ళి చూస్తాను. నువ్వు నిద్ర నటించు—" అంటూ తన బ్యాగులోంచి ఓ తెలుగు పత్రిక తీసి గుమ్మం వద్దకు వెళ్ళి తలుపు తీసింది.

వచ్చినది సుబ్బారావు కాదు. ఒక నడివయస్కురాలు.

"మీ అమ్మగారున్నారమ్మా?" అనడిగిందావిడ.

"మా అమ్మగారంటే?" ప్రశ్నించింది అప్సర.

"మీ అమ్మగారంటే మీ అమ్మగారే—దానికి వేరే అర్థాలేవు—" అందా నడివయస్కురాలు.

"నిజమే—కానీ ఇది మా యిల్లుకాదు. ఈ యింటికి చుట్టపు చూపుగా వచ్చాం మేము. ఈ ఇంటావిడ మా అమ్మకాదు—" అంది అప్సర.

ఆ నడివయస్కురాలు గతుక్కుమన్నట్లు కనబడింది- "ఇంటావిడెవరైతే నాకేమమ్మా — పక్కింట్లో దిగి రెండ్రోజులైంది. కాస్త కాఫీపొడి కావాలి. ఉందం టారో లేదంటారోనని గిన్నె తెచ్చుకోలేదు. కాస్త ఏ డబ్బాలోనైనా వేసి ఇస్తే — తర్వాత మీ డబ్బా మీ కిచ్చేస్తాను—" అందావిడ.

మహాలక్ష్మి చటుక్కున లేచి కూర్చుని — "పెద్ద డబ్బానా, చిన్న డబ్బానా?" అన్నది.

"డబ్బా పెద్దదైతే నేం—చిన్నదైతే నేం—నాకా వలసిందో కప్పుడు కాఫీ పొడుం—అంతేగా—" అని-

"అసలే మా ఇంట్లో డబ్బాలు లేవు. మీరే గ్లాస్కో డబ్బాలోనైనా వేసిచ్చారంటే సంతోషిస్తాను—...." అన్నది.

అప్సర సందేహించకుండా తమ సంచీలోంచి ఒక అరకేజీ గ్లాస్కో డబ్బాతీసి ఆవిడకిచ్చింది.

"వస్తానమ్మా — మీ కేమీ అనుకోనంటే డబ్బా వుంచేసుకుంటాను" అంటూ అక్కణ్నించి వెళ్ళిపోయిం దావిడ. అప్సర ఆవిడ వెనకాలే వెళ్ళి తలుపులు వేసింది.

"అమ్మయ్య—" అంది మహాలక్ష్మి—"ఇంక ఒక్కరే రావాల్సింది—"

13

టైము సుమారు పావు తక్కువ రెండయ్యేసరికి రంగ నాథ్ వెళ్ళిపోయాడు. సుబ్బారావు భారంగా నిట్టూ ర్చాడు. ఇంతవరకూ ఏమీ జరుగలేదు. ఇంకా జరుగు తుందన్న అనుమానం కూడా ఆయనకు లేదు. మరోసారి యింటికి ఫోన్ చేసి పరిస్థితి తెలుసుకుందామనుకున్నా డాయన. ఆ ప్రయత్నంలో ఆయన నంబరు డయల్ చేయబోతూండగా—

"మీరు తిన్నగా వున్నంతకాలం మీవాళ్ళకే ఇబ్బందీ రాదు. ఫోన్ చేయడం అనవసరం—...." అన్న మాటలు వినబడి అప్రయత్నంగా రిసీవర్ హుక్ చేసి వచ్చిన మనిషిని చూశాడు సుబ్బారావు.

"చాలాసేపటి క్రితమే రావాల్సింది నేను. కానీ మీతో యెవరో ఉన్నారు. అందుకని వేచివుండాల్సి వచ్చింది—" అన్నాడతను.

"ఎవరు మీరు?" అన్నాడు సుబ్బారావు.

"రంగనాథ్-" అన్నాడతను. సుబ్బారావులిక్కిపడి

కంగారుగా ఆయనవంక చూశాడు—"నేను వస్తానన్న సంగతి మీకు తెలుసునని నాకు తెలుసు. నేనిప్పుడు వచ్చినది—సరిగ్గా అయిదంటే అయిదే లక్షలకోసం...."

"అన్ని పేపర్సూ తీసుకొచ్చారా?"

రంగనాథ్ నవ్వి — "పేపర్సెందుకు?" అన్నాడు.

"లోన్ శాంక్షన్ కి—"

"నేను డబ్బు తీసుకు వెళ్ళడానికి రాలేదు. దాచడానికి వచ్చాను. అయితే అయిదు లక్షలు దాచాలి...."

"ఎక్కడ—ఎలా?"

"ఒక బ్యాంక్ ఏజంట్ గా మీరీ ప్రశ్న అడగడం బాగోలేదు. మీకు లాకరుందికదా-అందులో దాస్తాను.." అన్నాడు రంగనాథ్.

సుబ్బారావాశ్చర్యంగా — "నా బ్యాంకులో నా లాకర్లో అయిదు లక్షలు దాస్తారా? మీకంత నమ్మకముంటే నాదేమీ అభ్యంతరంలేదు—" అన్నాడు.

"మనుషుల్ని నమ్మకంగా వుంచడం వెన్నతో పెట్టిన విద్య నాకు. ఆ విషయంలో మీరేమీ భయపడనవసరం లేదు—" అన్నాడు రంగనాథ్ గంభీరంగా.

"భయం నాకెందుకూ-మీకుండాలిగానీ-" అన్నాడు సుబ్బారావు.

"నాతో పరిచయం కత్తిమీద సాములాంటిది. అది కొనసాగినంత కాలమూ యెవరైనా భయపడవలసిందే! అయితే నాకు నేనై యెవరి జోలికీ వెళ్ళను ..."

"అది నిజంకాదు. మీకు మీరై నాతో పరిచయం కలిగించుకున్నారు—"

"పరిచయం కావాలనే చేసుకున్నాను. కానీ దాన్ని జోలికిరావడం అనను. జోలికి రావడం అంటే నా విష

యంలో తెలిసినవారెవ్వరూ ఇప్పుడు బ్రతికిలేరు—”

“అలాగా—ఉదాహరణలేమైనా ఉన్నాయా?”

రంగనాథ్ నవ్వాడు—“ఉదాహరణకు మీరిప్పుడు సహకరించలేదనుకోండి. సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి మీకు భార్యా వియోగమూ, కడుపుశోకమూ కలుగుతుంది—”

సుబ్బారావు ముఖంలో కలవరపాటు స్పష్టంగా కనపడింది—“మీరనవసరంగా కాలయాపన చేస్తున్నారు. నాకింకా చూసుకోవాల్సిన పనులు చాలా వున్నాయి. లాకర్లో డబ్బు దాచుకోదల్చుకుంటే ఆ పని త్వరగా చేసి వెళ్ళండి—” అన్నాడాయన.

“గుడ్—పదండి—” అంటూ రంగనాథ్ లేచాడు. సుబ్బారావెవర్నో పిలిచాడు. అతడికేదో చెప్పాడు. మరుక్షణంలో అతను సుబ్బారావుకు పెద్దసైజు తాళాలున్న గుత్తి ఒకటిచ్చాడు.

అందుకుని—“రండి—” అన్నాడు సుబ్బారావు. ఏం జరుగుతుందోనని ఆయన గుండె దడదడలాడుతున్నది.

రంగనాథ్ లేచి నిలబడి ఉత్త చేతుల్తోనే ఆయన్ననుసరించాడు.

“ఉత్త చేతుల్తోనే వస్తున్నారు..” అన్నాడు సుబ్బారావు అనుమానంగా.

“అయిదులక్షలంటే క్యాషనుకున్నారేమిటి? వజ్రాలు- అంత విలువచేసే వజ్రాలు—జేబులో వున్నాయి పదండి” అన్నాడతను.

వజ్రాలనగానే సుబ్బారావు ముఖంలో ఏదో మార్పు వచ్చింది. అయినా ఆయన తొట్రుపడకుండా—ముందుకు నడిచాడు. ఇద్దరూ లాకరున్న గదిలోకి వెళ్ళారు. సుబ్బా

రావు ముందు పెద్ద తలుపు తీశాడు. లోపల చాలా అర లున్నాయి. ప్రతి అరకూ మూతేసి కీ హోల్సున్నాయి. మాస్టర్ కీతో లాకర్ నంబరు పదకొండు తెరిచాక సుబ్బారావు తన జేబులోకి చేయి పోనిచ్చి స్వంత తాళాల గుత్తి తీశాడు. అందులోని ఒక తాళం లాకర్ రెండో కీ హోల్లో పెట్టి తిప్పేక లాకర్ తలుపు తెరుచుకుంది.

జేబులోకి చేయి పోనిచ్చి ఒక చిన్న భరిణను బైటకు తీశాడు రంగనాథ్. నెమ్మదిగా దాన్ని లాకర్లోకి తోసే ముందు చేత్తో లోపల తడిమాడు. ఏమీ తగల్లేదు. లాకరు ఖాళీగా వుంది. రంగనాథ్ ముఖంలో కొద్దిగా నిరుత్సాహం కనిపించింది. అతను భరిణను లాకర్లో వదిలి సుబ్బారావు వంక తీక్షణంగా చూసి - "మీ కింకో లాకర్ వుందిగదా - నా రెండో భరిణను అందులో వుంచుతాను" అన్నాడు.

సుబ్బారావు తాపీగా - "లాకర్లో చాలా ఖాళీవుంది" అన్నాడు.

"సుబ్బారావుగారూ నిర్ణయాలు నావే కానీ మీవి కాదు. చెప్పినట్లు చేయడమే మీ కర్తవ్యం. రెండున్నర కల్లా నేను వెళ్ళి మీ యిల్లు చేరకపోతే__మీరు చాలా దుర్వార్తలు వినాల్సి వుంటుంది. కాబట్టి క్విక్ ...."

సుబ్బారావు ఆలస్యం చేయకుండా రెండో లాకర్ కూడా తెరిచాడు. ఆయన ముఖంలో కొద్దిగా దిగులు కనబడింది.

"నంబర్ ఇరవై ఏడుకదా - అది నా లక్కీ నెంబర్" అన్నాడు రంగనాథ్. అతను జేబులోంచి ఇంకో చిన్న భరిణను తీసి - ఆ లాకర్లో ఉంచుతూ చేత్తో తడిమాడు.

వున్నట్లుండి అతడి ముఖం వెలిగింది. బయటకు చిన్న భరిణతీసి - పరీక్షగా చూడసాగాడు.

"అది మీ భరిణ కాదు-" అన్నాడు సుబ్బారావు.

"కాదని ఎలా అనగలరు? దీనిమీద రంగనాథ్ అని పేరుంది చూడండి—" అంటూ అతను జేబులోంచి భూతద్దంతీసి భరిణకు పైగా వుంచాడు. అంతవరకూ చుక్కలుగా కనబడుతున్నవి - రంగనాథ్ అన్న అక్షరాలుగా మారాయి.

సుబ్బారావు తెల్లబోయాడు-"అవన్నీ మాకనవసరం. అది నా లాకర్లోది-"

"ఆ వస్తువుమీద నా పేరుంది!"

"అసలు మీ పేరు రంగనాథ్ అన్న గ్యారంటీ ఏమిటి?"

"ఏమిటా? దీన్ని చూడకముందే నా పేరు రంగనాథ్ అని మీకు చెప్పాను. దీనిమీద నా పేరుందన్న విషయంకూడా మీకు నేనే చెప్పిచూపించాను. ఇంకా చాలా వివరాలు తెలుసునుగానీ సమయం చాలదు. నేను త్వరగా వెళ్ళి మీ భార్యాబిడ్డల్ని రక్షించాలి. కాబట్టి ఆ రెండు లాకర్ల తాళాలు ఇలాగివ్వండి. వెంటనే వెళ్ళిపోతాను-..."

"నేనివ్వను-" అన్నాడు సుబ్బారావు.

"సుబ్బారావుగారూ — మీరు చిన్నపిల్లలుకారు. ఆ తాళాలు నాకు చాలా అవసరం. వెంటనే ఇచ్చేయండి" అన్నాడు రంగనాథ్.

"ఎందుకీ తాళాలు?" అన్నాడు సుబ్బారావు.

"రెండు ప్రయోజనాలు. ఒకటి నా వస్తువుల్ని నేను రక్షించుకోవడం. రెండు - ఇప్పుడు మీరు వెంటనే పోలీ

సుల్ని రప్పించి నన్ను పట్టించకుండా వుండడం. నన్ను పోలీసులు పట్టుకున్నారా - ఈ రెండు తాళాలూ పోలీసుల కిచ్చి మీ లాకర్లు చెక్ చేయమంటాను. వాటిలోకి దొంగ వస్తువులెలా వచ్చాయో చెప్పమంటాను. ఏ పరిస్థితుల్లో నేను వాటిని మీ లాకర్లో పెట్టానో-మీరు చెప్పలేరు. చెప్పుకున్నా యెవరూ నమ్మరు. ఎందుకంటే అందులో వుంచిన భరిణల మూతల్ని భూతద్దంలో చూస్తే— సుబ్బారావు అన్న పేరు కనబడుతుంది ఒకటి రెండ్రోజుల్లో లాకర్ల తాళాలు భద్రంగా మీకు అందుతాయి. ప్రస్తుతానికి నేను వెడుతున్నాను. అవతల మూడు ప్రాణాలు ప్రమాదంలో వున్నాయి..." అని సుబ్బారావు దగ్గర తాళాలు తీసుకుని - అక్కణ్నించి కదిలాడు రంగ నాథ్.

సుబ్బారావు నిశ్చేష్టుడై చూస్తూండిపోయాడు.

14

"ఎవరో తలుపు తడుతున్నారు. వెళ్ళిచూడు-" అంది మహాలక్ష్మి. ఆమె మంచంమీద నిద్ర నటిస్తూంటే— చేతిలో పుస్తకంతో వెళ్ళి తలుపు తీసింది అప్సర. ఎదురుగా నిలబడ్డ పోలీస్ కాన్‌స్టేబుల్ని చూసి ఉలిక్కి పడిందామె.

"మన్నించాలి-" అన్నాడు కాన్‌స్టేబుల్ — "ఇలా ఈ యింట్లోకి ఎవరైనా మనిషి వచ్చాడా?"

"లేదు-" అంది అప్సర.

"చేతిలో గ్లాక్సో డబ్బా వుంటుంది-" అన్నాడు కాన్‌స్టేబుల్ ఆమె మాటలు పట్టించుకోకుండా. గ్లాక్సో డబ్బా మాట వింటూనే ఉలిక్కిపడి లేచింది మహాలక్ష్మి.

"ఇలా రా నాయనా!" అన్నదామె. అతడు

లోపలకు నడిచాడు.

"ఏ మనిషీ ఈ ఇంట్లోకి రాలేదుకానీ - నా దగ్గర చాలా గ్లాక్సో డబ్బాలున్నాయి. కావాలంటే ఒక టిస్తాను. పట్టుకుపో-" అంది మహాలక్ష్మి.

"అర కేజీ దేనా?" అనడిగాడు కాన్‌స్టేబుల్.

"అవును-" అంటూ ఆమె అప్సరకు కనుసైగ చేసింది. అప్సర తమ సంచీలోంచి ఓ గ్లాక్సో డబ్బాతీసి పోలీసు కాన్‌స్టేబుల్‌కిచ్చింది. అతడు ధన్యవాదాలు చెప్పుకుని వెళ్ళిపోయాడు.

"మన పనై పోయింది-" అంది మహాలక్ష్మి.

"అయితే నేను సురేంద్రను లేపుతాను. నువ్వు అత్తయ్యగారిని లేపు-" అంది అప్సర. ఆమె వెళ్ళి నాలుగైదుసార్లు కుదిపేసరికి సురేంద్ర కళ్ళు నులుము కుంటూ లేచి - ఎదురుగా అప్సరను చూసి-"మీరు పక్క నుండగానే ఇంత మొద్దునిద్రపోయానా?" అన్నాడు.

"అమ్మ గురించీ నేనూ ఇంత సేపూ వుండిపోవలసి వచ్చింది. ఇప్పుడే అమ్మ లేచింది. వెళ్ళిపోదామంటోంది. వెళ్ళేముందు మీకు చెప్పిపోదామని..."

"చాలా మంచి సమయం వృథా అయిపోయింది-" సురేంద్ర బాధగా అన్నాడు.

"పోనీలెండి-ముందు రోజులన్నీ మనవేగదా-" అంది అప్సర అనునయంగా.

సులోచన సురేంద్రకోసం కేక పెట్టింది. అతను అక్క ణ్ణుంచి కదిలాడు. అతన్ని చూస్తూనే రిక్షా పిల్చుకుని రమ్మని చెప్పింది సులోచన. సురేంద్ర కదిలేలోగా టెలిఫోన్ మ్రోగింది. సురేంద్ర వెళ్ళి ఫోన్ తీశాడు.

ఎవరైనా కొత్తవాళ్ళు మనింటికొచ్చారా - అంతా

ఏంచేస్తున్నారు-అని ప్రశ్నించాడు సుబ్బారావు. సురేంద్ర ఇంట్లోని పరిస్థితి వివరించి ఫోన్ పెట్టేసే సమయానికి ఎవరో వీధి తలుపు తట్టారు. అతనే వెళ్ళి తలుపుతీసి ఎదురుగా కనబడ్డ మనిషిని చూసి ఉలిక్కిపడి రెండడుగులు వెనక్కి వేశాడు.

ఆ వ్యక్తి పోలీస్ డ్రస్సులో వున్నాడు.

"ఇన్స్పెక్టర్ ఈశ్వర్రావుని. చిన్న పని మీద మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యాల్సొచ్చింది—" అన్నాడా వ్యక్తి—"కొద్ది క్షణాలక్రితం—ఈ వీధిలోనే సందుచివర యాక్సిడెంటయింది. యాక్సిడెంటుకి గురైన వ్యక్తి పోలీస్ డ్రస్సులో వున్నాడు. అతడి చేతిలో ఒక అర కేజీ గ్లాక్సోడబ్బా వున్నది. పోలీసు మనిషివద్ద గ్లాక్సో డబ్బా - అందులోనూ రోడ్డు మీద యూనిఫాంలో తిరిగే సమయంలో ఉండడం మాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. విచారించినమీదట—ఆ కానిస్టేబుల్ మీ యింట్లోకి వచ్చాడనీ—తన చేతిలోని గ్లాక్సో డబ్బాను మీ యింట్లోంచే తీసుకువచ్చాడనీ తెలిసింది—" ఈశ్వర్రావు క్షణం ఆగి — "మీ ఇంట్లో ఎవరో అతడికా గ్లాక్సో డబ్బాని అందజేశారు...." అన్నాడు.

"మీరు పొరబడ్డారనుకుంటాను—...." అన్నాడు సురేంద్ర.

"ఇందులో నా పొరపాటేమీ లేదు—" అన్నాడు ఈశ్వర్రావు కఠినంగా—"అందుకు ఖచ్చితమైన సాక్ష్యముంది. మీ ఎదురింటాబ్బాయి రోజే జ్వరం తగ్గి పత్యం తిన్నాడట. నిద్రపోకూడదన్నారని వాళ్ళింటి కిటికీ దగ్గర కూర్చుని వీధివైపే చూస్తూ కాలక్షేపం చేశాడట. అతను చెప్పిన ప్రకారం ఈ రోజు మీ యింటినుంచి

ముగ్గురికి గ్లాస్కో డబ్బాలు అందాయి, ఒకటి ముష్టి వాడికి...."

ఈశ్వర్రావింకా ఏదో చెప్పబోతూండగా — "సరే నమకోండి. గ్లాస్కో డబ్బాలు ఇవ్వడంలో తప్పేముంది?" అంది సులోచన.

ఈశ్వర్రావు జవాబిచ్చేలోగా—"ముందు మేమిక్కణ్ణుంచి బయటపడే ఏర్పాటు చేయండి వదినగారూ— తర్వాత ఈయన సంగతి చూద్దురుగాని—" అంది మహాలక్ష్మి.

"మన్నించాలి. నా ప్రశ్నలకు జవాబు దొరికేవరకూ ఈ ఇంట్లోంచి ఎవ్వరూ కదలడానికి వీల్లేదు. ఇది చాలా సీరియస్ విషయం. ఆ గ్లాస్కో డబ్బాలు వజ్రాల స్మగ్లింగ్ కుపయోగించబడుతున్నాయి..." అన్నాడు ఈశ్వర్రావు.

సురేంద్ర దెబ్బతిన్నట్లు — "ఏమిటన్నారూ—కాస్త వివరంగా చెప్పండి" అన్నాడు.

"డబ్బాకు అడుగున కొన్ని లక్షలు విలువచేసే వజ్రాలుంటాయి. దానికి పైన చిన్న సీసా రేకు మూత వుంటుంది. ఆ పైన డబ్బాలో మామూలు నిత్యావసర వస్తువులుంటాయి. పోలీస్ కాన్ స్టేబుల్ వద్దనున్న డబ్బాలో పంచదార వుంది. అడుగున వజ్రాలున్నాయి. వాటి విలువ నాలుగు లక్షలు...." అన్నాడు ఈశ్వర్రావు.

15

మధ్యాహ్నం నిద్రపోకూడదని కిటికీ దగ్గర కూర్చున్న ఒక కుర్రవాడు — అనుకోకుండా జరిగిన యాక్సిడెంటు పోలీసులకు ఒక పెద్ద స్మగ్లింగ్ ముఠాని పట్టిచ్చాయి.

యాక్సిడెంట్ కు గురైన కానిస్టేబులు పోలీసు డిపార్టుమెంటుకు సంబంధించినవాడు కాదని తేలిపోయింది. అతడి దగ్గరున్న డబ్బాలో వజ్రాలు దొరికాయి. మహాలక్ష్మి, అప్సరలనను దబాయించగా మరికొందరు వ్యక్తులు బయటపడ్డారు.

మహాలక్ష్మి, అప్సర ముఠా వ్యక్తులు కారు. తామేం చేస్తున్నదీ వాళ్ళకు తెలియదు. ప్రతిఫలాపేక్షతో ఆ కుటుంబ వ్యక్తులందుకు సిద్ధపడ్డారు.

కానిస్టేబులు వేషధారికీ ప్రాణ ప్రమాదం జరుగలేదు. అయిదారురోజుల్లో అతను కోలుకున్నాక—మరికొందరు వ్యక్తుల పేర్లు తెలిశాయి.

కేసు నెలరోజులకు పైగా నడిచేక—నగరంలోని పెద్ద వ్యాపారస్థులలో ఒకడైన రంగనాథ్ కు ఈ స్మగ్లింగ్ తో సంబంధముందనీ—అతడి స్నేహితుడు నాగరాజారావు ఈ విషయంలో అతనికి కుడి భుజంగా ఉంటున్నాడనీ కూడా బయటపడింది.

పటిష్టమైన పథకంతో కుటుంబపరంగా వ్యవహారం నడిపించడంవల్ల పోలీసులకు ఆచూకీలు దొరకడంలేదు. అదృష్టమే నేరస్థులను పోలీసులకు పట్టిచ్చింది.

అదృష్టం సుబ్బారావును వరించిందనాలి. ఆయన వద్ద నుంచి లాకర్ తాళాలు తీసుకుపోయిన వ్యక్తి మర్నాడే ఆయనకు పోస్టులో అవి పంపించేశాడు. తన లాకర్లో ఉంచబడిన భరిణల్లో వున్నవి గాజాపూసలని తెలుసుకుందుకు సుబ్బారావుకు ఎన్నో రోజులు పట్టలేదు. అనుకోకుండా తనకు దొరికిన వజ్రాలు—అలాగే పోయినా—ఈ కేసులో తను ఇరుక్కోనందుకు ఆయన సంతోషించాడు.

ఇటు సుబ్బారావునుంచి వజ్రాల భరిణను సంపాదించడమూ — అటు తన స్మగ్లింగ్ కొనసాగించడమూ — రెండూ నెరవేరడంకోసం - ఒకప్పుడు కట్నం గురించి పెళ్ళి చెడిపోయిన వాసుదేవరావు బంధువులను పట్టాడు నాగరాజారావు. అతడి పథకం తెలివైనదే — కానీ విధి వక్రించింది!

ఏ ఉద్దేశ్యంతోనైతేనేం-నాగు-వాసుదేవరావు, దేవీబాలలను ఒకటి చేద్దామనుకున్నాడు. అసలు ఉద్దేశ్యం నెరవేరినా - సురేంద్ర, అప్సర - దేవీబాల, వాసుదేవరావులకు కొన్ని నెలల తర్వాత వైభవంగా వివాహాలు జరిగాయి.

పాపం - కటకటాల వెనకనున్న నాగరాజారావుకు తన పథకం సగభాగం నెరవేరిందని తెలియదు.

—:ఐ పో యిం ది:—